

ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -149 | పేజీలు - 8 | వెల ₹03/- | శనివారం 5 సెప్టెంబర్ 2026

ఉద్యోగుల సమస్యలు కొలిక్కొచ్చేనా

ఉద్యోగ, ఉపాధ్యాయ నేతలతో చంద్రబాబు నేడు కీలక భేటీ

పీఆర్సీ, కరవు భత్యం తదితర అంశాలపై చర్చించనున్న సీఎం

నిన్న చంద్రబాబును కలిసిన ఏపీ జేఏసీ నేతలు

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న ముఖ్యమంత్రి

అమరావతి, సెప్టెంబరు 4 (రిపబ్లిక్ న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నేడు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. కొత్త పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ అమలుతో పాటు కరవు భత్యం బకాయిలు తదితర కీలక అంశాలపై ఈ భేటీలో సమగ్రంగా చర్చించనున్నారు.

సచివాలయంలో ఏపీ జేఏసీ నాయకులు ఎ. విద్యాసాగర్, డీవీ రమణ, భారతీ ప్రసాద్ తదితరులు సీఎం చంద్రబాబును కలిశారు. ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న ఆందోళనలను, ఆర్థికేతర సదుపాయాల పెండింగ్ అంశాలను విద్యాసాగర్ సీఎంకు వివరించి, తక్షణ పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి... ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అత్యంత కట్టుబడి ఉందో స్పష్టం చేశారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగులకు అందాల్సిన న్యాయమైన ప్రయోజనాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి సానుకూలంగా చర్చలు జరుపుతున్న తరుణంలో, ఉద్యోగ సంఘాలు తొందరపడి ఆందోళన బాట పట్టడంపై సీఎం చంద్రబాబు కొంత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సమగ్ర చర్చల వేదిక అందుబాటులో ఉన్నప్పుడు కొద్దిగా ఓర్పు



వహించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రితో భేటీపై హర్షం వ్యక్తం చేసిన ఏపీ జేఏసీ నేతలు... ప్రభుత్వం వైపు నుంచి సానుకూల చర్చల ప్రక్రియను స్వాగతిస్తున్నామని, సీఎం స్థాయిలోనే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులను తీర్చిదిద్దడంలో టీచర్లదే కీలకపాత్ర

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



న్యూఢిల్లీ,సెప్టెంబరు 4 (రిపబ్లిక్ న్యూస్)విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం చేస్తూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆమె శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల మార్గనిర్దేశం, మెంటార్‌షిప్ ద్వారా విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి, వారి వ్యక్తిత్వ వికాసానికి బలమైన మిగతా2లో...

కేరళలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్



అమరావతి,సెప్టెంబరు 4 (రిపబ్లిక్ న్యూస్)ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం కేరళలో పర్యటించారు. కొల్లం జిల్లాలోని ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రమైన మాతా అమృతానందమయి (అమ్మ) ఆశ్రమాన్ని మిగతా2లో...

పల్లె చెరువులకు కొత్త కళ

- రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ. 50 కోట్లతో 105 చెరువుల ఆధునీకరణ ఇప్పటికే 26 చెరువులకు పునరుజ్జీవం ● భూగర్భ జలాల పెంపు.. సమగ్ర అభివృద్ధే ధ్యేయం
- వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ ఎయిర్ జిమ్‌లు, చిల్డ్రన్ పార్కులతో కొత్త రూపు ● సెప్టెంబర్ నెలాఖరుకల్లా పనులు పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం



మంగళగిరిసెప్టెంబరు 4 (రిపబ్లిక్ న్యూస్)సాగు నీటి వనరుల సంరక్షణ నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నుంచి ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల వరకు సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ ప్రత్యేక కృషి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధిపై లక్ష్యంగా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉప ముఖ్యమంత్రి చొరవకు 'ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన' పథకం తోడవడంతో రాష్ట్రవ్యాప్తంగా మంచినీటి చెరువులు, సరస్సుల పునరుజ్జీవనానికి కొత్త ఊపు వచ్చింది. శ్రీ పవన్ కళ్యాణ్ గారి దార్శనికత, అభివృద్ధి పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతతో చెరువులకు కొత్త జీవం పోయడమే కాకుండా, వాటిని మరింత మిగతా2లో...

ఆంధ్రా పేపర్ మిల్స్‌పై ఇక ఉపేక్షించం

- మిల్స్ యాజమాన్యంపై ఏపీ ఉప ముఖ్యమంత్రి ఆగ్రహం



ఏపీలో మున్సిపల్ కార్పొరేషన్ల వార్డుల పునర్విభజన

- పునర్విభజన షెడ్యూల్ విడుదల

అమరావతి, సెప్టెంబరు 4 (రిపబ్లిక్ న్యూస్)ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియకు పురపాలక శాఖ డైరెక్టర్ షెడ్యూల్ విడుదల చేశారు. దీనికి సంబంధించి తక్షణమే ప్రతిపాదనలు పంపాలని అన్ని ప్రధాన కార్పొరేషన్లకు ఆదేశాలు జారీ చేశారు. 2011 జనాభా మిగతా2లో...

జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతం

జియోసింక్రోనస్ కక్ష్యలోకి దేశ మొట్టమొదటి ఇమేజింగ్ శాటిలైట్



న్యూఢిల్లీ,సెప్టెంబరు 4 (రిపబ్లిక్ న్యూస్) భారత అంతరిక్ష పరిశోధన సంస్థ-ఇస్రో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి ఇస్రో ప్రయోగించిన జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. దేశంలోనే తొలిసారి జియో-ఆర్బిట్ కోసం ఉద్దేశించిన అత్యాధునిక ఎర్త్ అబ్జర్వేషన్ ఉపగ్రహం జూఐ-05ను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో రియల్ టైమ్ ఇమేజరీ అందించడంలో ఈ ఉపగ్రహం ఎంతో కీలకం కానుంది. రెండో లాంచ్ ప్యాడ్ నుంచి వేకువ జామున 2గంటల 55నిమిషాలకు జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ అత్యాధునిక భూ పరిశీలన ఉపగ్రహం జూఐ-05ను నింగిలోకి మోసుకెళ్లింది. సబ్-జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. సుమారు 8నెలల విరామం తర్వాత ఇస్రో ఈ మిషన్‌ను చేపట్టింది. జీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది 19వ రాకెట్ ప్రయోగం. 2,268 కిలోల మిగతా2లో...

కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఊరట

- మంత్రి సత్యకుమార్ ఆదేశాలతో కీలక ఉత్తర్వులు జారీ
- రేడియోగ్రాఫర్లు, నర్సులు, పీహెచ్‌సీ సిబ్బంది సమస్యలకు పరిష్కారం
- ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా ప్రోత్సాహకాలు



అమరావతి,సెప్టెంబరు 4 (రిపబ్లిక్ న్యూస్) దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాంట్రాక్ట్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) విజ్ఞప్తులపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. మంత్రి ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్‌బాబు సమీక్షలు నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారులు కాంట్రాక్టు ఉద్యోగులకు ఊరట నిచ్చేలా కీలక ఉత్తర్వులు జారీ చేశారు.

రేడియోగ్రాఫర్లకు ప్రత్యేక సెలవులు రేడియేషన్ ముప్పును ఎదుర్కొంటున్న కాంట్రాక్ట్ రేడియోగ్రాఫర్లు, రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్లకు ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. బోధనాస్పత్రుల్లో ఎక్స్‌రే, రేడియాలజీ విభాగాల్లో విధులు నిర్వహించే అర్హులైన సిబ్బందికి ప్రతి 11 మిగతా2లో...

కొండా సురేఖను తొలగించారు..

- పొంగులేటి సంగతి ఏమిటి?:

- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు



కాంట్రాక్ట్ ఉద్యోగులకు భారీ ఊరట

(మొదటి పేజీ తరువాయి)

నెలల విధి పూర్తయిన తర్వాత 30 రోజుల తప్పనిసరి ప్రత్యేక సెలవు మంజూరు చేయాలని ఆదేశించింది. ఈ సెలవును సాధారణ లీవ్ ఖాతా నుంచి మినహాయించరాదని స్పష్టం చేసింది. సిబ్బంది సర్దుబాటుపై పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత, విధుల సర్దుబాటుపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. స్థానిక అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని ఆదేశించింది. పగటి సమయంలో ఎంఎన్ఓలు, ఎఫ్ఎన్ఓల సేవలను, రాత్రి సమయంలో అవసరానికి అనుగుణంగా ఎస్ఏబ్యూల సేవలను వినియోగించా లని సూచించింది. ముఖ్యంగా రాత్రి విధులు నిర్వహించే సిబ్బందికి సహాయకంగా వీరి సేవలను ఉపయోగించుకోవాలని పేర్కొంది. నర్సులపై పని భారం తగ్గిస్తూ నర్సులపై ఉన్న 12 గంటల నిరంతర విధి భారం తగ్గించేలా కూడా చర్యలు తీసుకున్నారు. పీహెచ్‌సీలో ముగ్గురు నర్సులు పనిచేస్తున్న సందర్భంలో ఒకరు సెలవులో ఉన్నా, మిగిలిన సిబ్బందితో రొటేషన్ పద్ధతిలో విధులు సర్దుబాటు చేయాలని ఆదేశించారు. పగటి సమయంలో ఒక నర్సుపై 12 గంటల నిరంతర విధి భారం పడకుండా చూడాలని స్పష్టం చేశారు. స్థానికంగా అందుబాటులో ఉన్న ంబ్ఓ సేవలను సమర్థంగా వినియోగించుకుని విధుల సర్దుబాటు చేయాలని సూచించారు. **పీహెచ్‌సీ ల్లో విద్యార్థులకు శిక్షణ** డీఎంఎల్‌టీ, బీఎస్సీ (ఎంఎల్‌టీ) విద్యార్థులకు కూడా పీహెచ్‌సీల్లో క్లినికల్ శిక్షణకు అవకాశం కల్పించారు. 6 లేదా 12 నెలల క్లినికల్ శిక్షణలో భాగంగా నెలరోజుల పాటు పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో శిక్షణ పొందేలా మార్గదర్శకాలు జారీ చేశారు. విద్యార్థులకు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులు శిక్షణ కేంద్రాలను కేటాయించనున్నారు. **ఎన్టీఆర్‌విఎస్‌టీ కింద ప్రోత్సాహకాలు** శస్త్రచికిత్సలు, ప్రొసీజర్లకు ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా అందే ప్రోత్సాహకాల్లో డాక్టర్లతో పాటు వాటిలో పాల్గొనే కాంట్రాక్ట్ పారామెడికల్ సిబ్బందికీ వారి క్యాడర్‌కు అనుగుణంగా నిర్ణయించిన వాటా ఇవ్వాలని ఆదేశించారు. స్టాఫ్ నర్సులు, ఓటీ టెక్నీషియన్లు, అనస్థీషియా టెక్నీషియన్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఇతర సంబంధిత సిబ్బందిని కూడా అర్హత మేరకు చేర్చాలని స్పష్టం చేశారు. ప్రతి నెల శస్త్రచికిత్సలు, పాల్గొన్న సిబ్బంది, వారికి అందే ప్రోత్సాహక మొత్తాల వివరాలను నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్‌బాబు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పల్లె చెరువులకు కొత్త కళ

(మొదటి పేజీ తరువాయి)

సమర్థవంతమైన సాగునీటి వనరులుగా తీర్చిదిద్దే దిశగా విస్తృత స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. చెరువుల ఆధునీకరణ ద్వారా భూగర్భ జలాలను పెంపొందించడం, పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడటం, సాగునీటి సామర్థ్యాన్ని బలోపేతం చేయడంతోపాటు గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన, ఆహ్లాదకరమైన జీవన వాతావరణాన్ని అందించాలన్న సమగ్ర లక్ష్యంతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయి. **105 చెరువులు... రూ. 50 కోట్ల అంచనా వ్యయంతో పనులు** రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కోసం మొత్తం అనుగుణంగా పనులను చేపడుతున్నారు. ఈ కార్యక్రమం పూర్తయితే చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతోపాటు సాగు నీటి వనరులు మరింత బలోపేతం కానున్నాయి. అలాగే భూగర్భ జలాల వృద్ధికి తోడ్పడనున్నాయి.చెరువులకు కొత్త రూపు.. ప్రజలకు కొత్త సౌకర్యాలుచెరువుల ఆధునీకరణ ప్రక్రియలో భాగంగా చెరువు గట్ల బలోపేతం, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు, ప్రవేశ ద్వారాల నిర్మాణం, సోలార్ లైట్ల ఏర్పాటు, సిట్టింగ్ బెంచ్‌ల ఏర్పాటు వంటి పనులు చేపడుతున్నారు. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కుల ఏర్పాటు చేయడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఓపెన్ ఎయిర్ జిమ్ పరికరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు చెరువుల సుందరీకరణ పనులకు ప్రాధాన్యం ఇస్తూ, వాటిని ప్రజల విశ్రాంతి, ఆరోగ్యం, వినోదానికి అనువైన కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే చిత్తూరు జిల్లా, కుప్పం నియోజకవర్గం పరిధిలోని వెదుళ్ల చెరువు, కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలోని పండూరు చెరువు, గుంటూరు జిల్లా వెంగళాయపాలెం చెరువు, అనంతపురం జిల్లాలో గుడిశెలపల్లి చెరువు, నెల్లూరు జిల్లాలోని వింజమూరు, శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం తదితర చెరువులు పూర్తి స్థాయి అభివృద్ధి పనులు పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి, రాష్ట్రంలో అమలుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ధన్యవాదాలు తెలియజేశారు.

జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

బరువు ఉన్న -05 ఉపగ్రహం సరిహద్దు ప్రాంతాలను వేగంగా, స్పష్టంగా కెమెరాలతో పరిశీలించనుంది. తుపానులు వరదలు, భూకంపాలను నిమిషాల వ్యవధిలోనే గుర్తించనుంది. ప్రకృతి విపత్తులపై ముందస్తు హెచ్చరికలను జారీ చేయనుంది. పంటల ఆరోగ్యం, భూ వినియోగంలో మార్పులను పరిశీలించనుంది. దేశ రక్షణరంగంలో ఈ ఉపగ్రహం కీలకం కానుంది. సరిహద్దుల సమాచారాన్ని రియల్ టైమ్‌లో సేకరించనుంది. వరుసగా ఎదురైన వైఫల్యాల తర్వాత ఇస్రో సాధించిన ఈ విజయం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటివరకు చేపట్టిన 18 ప్రయోగాల్లో ఈ రాకెట్ 6సార్లు పూర్తిస్థాయి విజయాన్ని నమోదుచేయలేకపోయింది. 2021లో మిషన్ ప్రయోగం 307సెకన్ల తర్వాత క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో విఫలమైంది. దానికి ప్రత్యామ్నాయంగా ఈ మిషన్‌ను విజయవంతంగా చేపట్టారు. అంతకుముందు ఈ ఏడాది జనవరి 12న 16ఉపగ్రహాలతో ప్రయోగించిన రాకెట్ కీలకమైన మూడోదశలో తలెత్తిన లోపం కారణంగా నిర్దేశిత కక్ష్యలోకి చేరలేకపోయింది. 2025 మే నెలలో చేసిన ఎల్వీఎం-జ 61 ప్రయోగం కూడా మోటార్ కేస్‌లో ప్రెజర్ సమస్యల వల్ల సక్సెస్ కాలేదు. ఈ నేపథ్యంలో ఇస్రో సుదీర్ఘ విరామం తర్వాత జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతం చేసింది. మరోవైపు ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా తొలి మానవరహిత మిషన్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఇస్రో ఛైర్మన్ ఎ.నారాయణన్ వెల్లడించారు. దీనికోసం వివిధ పరిశ్రమలు, ఇతర సంస్థలతో కలిసి ఇస్రో బృందం అత్యంత ప్రణాళికాబద్ధంగా, ముమ్మరంగా పనిచేస్తోందని తెలిపారు. ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టాక ఇస్రో ఛైర్మన్ శాస్త్రవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఈఓఎస్-05 ప్రయోగం ద్వారా ఇస్రో తొలి విజయాన్ని నమోదు చేసిందని పేర్కొన్న ఆయన, కష్టానికి దక్కే ప్రతిఫలం మరింత కష్టపడటమేనని ఉద్ఘాటించారు. దేశ బహుళ అవసరాల నిమిత్తం భూమిని నిశితంగా పరిశీలించేందుకు 36,000 కి.మీ.లు జియో సింక్రనస్ ప్లాట్‌ఫారమ్‌లో ఉంచుతున్న మొట్టమొదటి ఉపగ్రహం ఇదే కావడం విశేషమని అన్నారు. జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ద్వారా ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడంపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ 'ఎక్స్' వేదికగా ఇస్రో బృందానికి అభినందనలు తెలిపారు. 'అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన మరో అతిపెద్ద పేలోడ్ ఇది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో భారతదేశ అంతరిక్ష సామర్థ్యాలు సరికొత్త శిఖరాలకు చేరుకుంటున్నాయి. ప్రపంచ అంతరిక్ష శక్తిగా మన దేశం బలపడుతోంది' అని ఎక్స్‌లో రాసుకొచ్చారు.

కొండా సురేఖను తొలగించారు

హైదరాబాద్,సెప్టెంబరు 4 (రిపబ్లిక్ న్యూస్) తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు.

సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమె త్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్‌లోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బండీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితా లోని పేదల భూ ములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.


భూ సమ స్యలపై ప్రశ్ని స్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవ మానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాం కు లు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక కబ్జాల రాజ్యమా అని నిలదీశారు.

ఆంధ్రా పేపర్ మిల్స్‌పై ఇక ఉపేక్షించం

● మిల్స్ యాజమాన్యంపై ఏపీ ఉప ముఖ్యమంత్రి ఆగ్రహం

అమరావతి,సెప్టెంబరు 4 (రిపబ్లిక్ న్యూస్)



ఆంధ్రా పేపర్ మిల్స్ యాజమాన్యంపై ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమండ్రి వద్ద గోదావరి నది కాలుష్యం కావడానికి ఆంధ్రా పేపర్ మిల్సే ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. నదిలోకి కాలుష్యాన్ని విడిచిపెడుతూ పన్నులు మాత్రం ఎగ్గొడుతున్నారంటూ మండిపడ్డారు. 'ఆంధ్రా పేపర్ మిల్స్.. పన్నులు చెల్లించి పుష్కరకాలం దాటింది. పన్నులు చెల్లించమంటే కోర్టులకెళ్లి కాలయాపన చేస్తున్నారు. పన్నులు చెల్లించేందుకు ఇంతటి బాధ్యతారాహిత్యం ఎందుకు? తప్పు సరిదిద్దుకునే అవకాశం ఇచ్చినా స్పందించడం లేదు. నోటీసు పంపి 3 నెలల సమయం ఇచ్చినా కనీస స్పందన లేదు. ఆంధ్రా పేపర్ మిల్స్‌పై ఇక ఉపేక్షించం.. కఠిన చర్యలు తీసుకుంటాం' అని పవన్ పేర్కొన్నారు. కాగా, రాష్ట్ర పర్యావరణ శాఖామంత్రిగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత గోదావరి నది జలాల కాలుష్యంపై ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెల్సిందే. దీంతో ఆయన గోదావరి నది ఒడ్డున ఉన్న పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థజలాలను స్వయంగా పరిశీలించి, ఈ వ్యవహారంలో గోదావరి జల్లాల్లో విడుదలకాకుండా తగిన చర్యలు తీసుకునేలా ఆయా కంపెనీల యాజమాన్యానికి సమయం ఇచ్చారు. అయినప్పటికీ ఆంధ్రా పేపర్ మిల్స్ వంటి పలు యాజమాన్యాలు ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి కోర్టురను ఆశ్రయించి కాలయాపన చేస్తున్నాయి.

విద్యార్థులను తీర్చిదిద్దడంలో టీచర్లదే కీలకపాత్ర

(మొదటి పేజీ తరువాయి)

పునాది వేయవచ్చని రాష్ట్రపతి పేర్కొన్నారు. అంకితభావంతో, శ్రద్ధతో పనిచేసే ఉపాధ్యాయుడు ప్రతి విద్యార్థిలోని ప్రత్యేక సామర్థ్యాన్ని గుర్తించి, వారిలో స్ఫూర్తిని నింపడంతో పాటు అత్యుత్తమ ప్రతిభను కనబరిచేలా ప్రోత్సహించగలరని ఆమె అన్నారు.ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తమ జ్ఞానాన్ని నవీకరించుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించాలని, వినూత్న బోధనా పద్ధతులను అనుసరించాలని ముర్ము సూచించారు. విద్యార్థుల్లో స్వతంత్ర ఆలోచనా విధానాన్ని పెంపొందించడంతో పాటు ప్రశ్నించే, విషయాలను లోతుగా తెలుసుకోవాలనే ఆసక్తిని ప్రోత్సహించడం ఎంతో ముఖ్యమని ఆమె చెప్పారు. భారత మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్రపతి తెలిపారు.

కేరళలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మను దర్శించుకుని ఆమె ఆశీస్సులు అందుకున్నారు. ఇది పూర్తిగా లోకేశ్ వ్యక్తిగత పర్యటన అని, అధికారిక కార్యక్రమం కాదని తెలుస్తోంది. అమృతపురిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆశ్రమంలో లోకేశ్ దాదాపు మూడు గంటల పాటు గడిపారు. ఆశ్రమ ప్రాంగణంలో ఉన్న కాళీమాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మను కలుసుకుని ఆశీర్వాదం పొందారు. ఆశ్రమంలోని గజరాజులకు పండ్లు అందించారు. ఈ పర్యటన తనకు ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తినిచ్చిందని లోకేశ్ పేర్కొన్నారు. తన పర్యటనకు సంబంధించిన వివరాలను ఆయన తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా లోకేశ్ అక్కడి విద్యాసంస్థలను కూడా పరిశీలించారు. ఆశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న అమృత విశ్వ విద్యాపీఠంతో పాటు, అమృత ఆయుర్వేద కళాశాలను ఆయన సందర్శించారు. అక్కడి విద్యాబోధన, మౌలిక సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏపీ విద్యాశాఖ మంత్రిగా ఆయన విద్యాపీఠాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఆధునిక డిజైన్లతో హస్తకళలకు శిక్షణ

అమరావతి, మన జనప్రగతి, సెప్టెంబర్04: మారుతున్న అభిరుచులకు అనుగుణంగా సంప్రదాయ హస్తకళల్లో ఆధునిక డిజైన్లను ప్రవేశపెట్టి, కళాకారుల ఆదాయం, ఉపాధిని పెంచే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నాయని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు.రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 770 మంది హస్తకళాకారులకు క్లస్టర్ల వారీగా నెల, రెండు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.1.35 కోట్లు మంజూరు చేసిందని, తొలి విడతగా రూ.1.01 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు.గురు-శిష్య హస్త శిల్ప్ ప్రశిక్షణ్, డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ ద్వారా చెక్క శిల్పం, కలంకారి, దుర్గి రాతి శిల్పం, తాటి ఆకుల కళ, టెర్రకోట, వెదురు, బొబ్బిలి వీణ, సవర గిరిజన చిత్రకళ తదితర సంప్రదాయ కళల్లో ఆధునిక డిజైన్లపై శిక్షణ అందించనున్నట్లు మంత్రి తెలిపారు.అనంతపురం, పల్నాడు, అనకాపల్లి క్లస్టర్లకు చెందిన 200 మంది కళాకారులకు శిక్షణతో పాటు మెరుగైన పనిముట్ల కిట్లు అందించనున్నట్లు చెప్పారు. సంప్రదాయ కళలను కాపాడుతూ ఆధునిక డిజైన్లు, నాణ్యమైన పనిముట్లు అందించడం ద్వారా కళాకారుల ఆదాయం పెంచడంతో పాటు ఆంధ్రప్రదేశ్ హస్తకళలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత పేర్కొన్నారు.

ఏపీలో మున్సిపల్ కార్పొరేషన్ల వార్డుల పునర్విభజన

(మొదటి పేజీ తరువాయి)

లెక్కలను ప్రాతిపదికగా తీసుకుని ఈ వార్డుల పునర్విభజనను చేపట్టనున్నారని సమాచారం. ఈ ప్రతిపాదనలపై నేటి నుంచి 7 రోజుల పాటు (ఈ నెల 11వ తేదీ వరకు) ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించనున్నట్లు పురపాలక శాఖ తెలిపింది. ఆ తర్వాత పురపాలక డైరెక్టర్ పరిశీలించి ఆమోదం తెలిపిన అనంతరం సెప్టెంబర్ 13న డీలిమిటేషన్ వార్డుల తుది ప్రకటన వెలువడనుంది. మరుసటి రోజు, అంటే ఈ నెల 14న ఆంధ్రప్రదేశ్ అధికారిక గెజిట్‌లో వార్డుల పునర్విభజన ప్రకటనను ప్రచురిస్తారు. ఈ ఆదేశాలు జీవీఎంసీ (విశాఖపట్నం), విజయ వాడ, మచిలీపట్నం, కర్నూలు, గుంటూరు, నెల్లూరు, ఒంగోలు, తిరుపతి, కడప, ఏలూరు, అనంత పురం,చిత్తూరువంటి రాష్ట్రంలోని ప్రముఖ కార్పొరేషన్లన్నింటికీ వర్తిస్తాయని అధికారులు వెల్లడించారు.

ఢిల్లీలో కుండపోత వర్షం

న్యూఢిల్లీ, ,సెప్టెంబరు 4 (రిపబ్లిక్ న్యూస్) దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఈ కుండపోత వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, పలు విమానాలను ఇతర నగరాలకు దారి మళ్లించారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఢిల్లీలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోని పలు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఈ ప్రభావంతో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల మధ్యలో దాదాపు తొమ్మిది విమానాలను దారి మళ్లించారు. వీటిలో నాలుగు విమానాలను జైపూర్‌కు, మరో నాలుగు లక్నోకు, ఒకటి అహ్మదాబాద్‌కు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఫ్లైట్‌రాడార్24 డేటా ప్రకారం, 400కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ విమానాశ్రయంలో రోజుకు 1,300కు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమాన సర్వీసులపై ప్రభావం పడిందని ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు వేర్వేరుగా ప్రకటించాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందు తమ ఫ్లైట్ స్టేటస్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నెమ్మదిగా ప్రయాణం సాగుతున్నందున, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించుకోవాలని ఇండిగో కోరింది. ఎయిర్‌పోర్ట్‌లో కార్యకలాపాలపై ప్రభావం పడిందని, తాజా సమాచారం కోసం ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం విజ్ఞప్తి (జీఎంఆర్) చేసింది. నీటిని తొలగించడానికి తమ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపింది. మరోవైపు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన తీవ్ర వర్షపాతం నమోదవుతుందని హెచ్చరించింది. ఈ ఆకస్మిక పరిణామంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

6న ఎర్రవల్లిలో బీఆర్ఎస్ పార్టీ శాసన సభా పక్ష భేటీ

● పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన సమావేశం

హైదరాబాద్, ,సెప్టెంబరు 4 (రిపబ్లిక్ న్యూస్)

సెప్టెంబర్ 07 వ తేదీ నుంచి రాష్ట్ర శాసన సభ సమావేశాలు ప్రారంభం కానున్ననేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ శాసన సభా పక్ష సమావేశం నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 06 న ఎర్రవల్లి నివాసంలో మధ్యాహ్నం 1 గంటకు లంచ్ అనంతరం 2 గంటలకు పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులతో కూడిన సంయుక్త సమావేశం జరగనున్నది. ఈ సమావేశానికి హాజరుకావాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే అంశాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి పార్టీ శ్రేణులకు కేసీఆర్ దిశా నిర్దేశం చేయనున్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

శనివారం 5 సెప్టెంబర్ 2026

మండపాల నిర్మాణంలో కష్టాలు

కూలీల ప్రాణాలకు ముప్పు -వినాయక చవితి సంబరాల ఉత్సాహం

భద్రత లేకుండానే మండపాల ఏర్పాటు

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ ఏదీ

పొట్టకూటి కోసం ప్రాణాలను పణంగా పెడుతున్న వలస కార్మికులు





అనంతపురం ప్రతినిధి, సెప్టెంబర్ 04,(రిపబ్లిక్ న్యూస్):
వినాయక చవితి వేడుకలకు నగరంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రధాన కూడళ్లు, వీధుల్లో మండపాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు భారీ మండపాలను ఏర్పాటు చేస్తుండగా వాటి నిర్మాణంలో పనిచేస్తున్న కార్మికుల భద్రత మాత్రం గాలికొదిలేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
పొట్టకూటి కోసం ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన కార్మికుల భద్రత పై ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలు తీసుకొచ్చినా, క్షేత్రస్థాయిలో వాటి అమలుపై పర్యవేక్షణ లోపిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా నిర్మాణ పనులు, మండపాల ఏర్పాటు వంటి చోట్ల కార్మికులు ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్నా సంబంధిత అధికారులు తరచూ తనిఖీలు నిర్వహిస్తున్న దాఖలాలు కనిపించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఏమాత్రం అదుపుతప్పినా కిందపడే ప్రమాదం

కార్మికులు ఎత్తైన వెదురు కట్టడాలపై నిలబడి ప్రమాదకర పరిస్థితుల్లో పనులు చేస్తున్నారు. కనీసం హెల్మెట్లు, సేఫ్టీ బెల్టులు, రక్షణ తాళ్లు వంటి భద్రతా పరికరాలు లేకుండానే ఎత్తుకు ఎక్కి మండపాలను నిర్మిస్తున్నారు. కింద నుంచి చూస్తేనే ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్న పరిస్థితుల్లో సైతం కార్మికులు తమ కుటుంబాల పోషణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్నారు.మండపం అందంగా కనిపించాలనే ఆరాటంలో, దాన్ని నిర్మించే కార్మికుడి భద్రతను మాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెదురు కర్రలను తాళ్లు, వస్త్రాలతో కట్టి ఏర్పాటు చేసిన తాత్కాలిక కట్టడాలపై కార్మికులు అటూ ఇటూ తిరుగుతూ పనులు పూర్తి చేస్తున్నారు. ఏమాత్రం అదుపుతప్పినా కిందపడే ప్రమాదం ఉన్నప్పటికీ రక్షణ ఏర్పాట్లు కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోంది.
మండపాల నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న కాంట్రాక్టర్లు కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉన్నా, పనులను త్వరగా పూర్తి చేయాలనే తొందరలో నిబంధనలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

ఉత్సవం కోసం ... కార్మికుల కష్టం

భారీ మండపాలను తీర్చిదిద్దేందుకు వలస కార్మికులు ఎత్తైన కట్టడాలపై ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్నారు. అయితే వారికి అవసరమైన రక్షణ పరికరాలు, భద్రతా ఏర్పాట్లు కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పండుగ సంబరాల కోసం నిర్మిస్తున్న మండపాల వెనుక కూలీల కష్టం దాగి ఉంది. ఉత్సవం కోసం నిర్మించే మండపం, కార్మికుడి ప్రాణానికి ముప్పుగా మారకూడదని, అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి భద్రతా చర్యలు పాటించేలా చూడాల్సిన అవసరం ఉంది.

కార్మికుల భద్రతపై అధికారులు దృష్టి సారించాలి

భద్రతా పరికరాలు సమకూర్చడం, ప్రమాదకర ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టడం, కింద ప్రజలు సంచరించకుండా జాగ్రత్తలు తీసుకోవడం వంటి అంశాలను విస్మరిస్తున్నారని స్థానికులు అంటున్నారు.మరోవైపు నగరంలో పెద్ద సంఖ్యలో మండపాల నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించకుండా చేతులెత్తేస్తున్నారు.అనుమతులు, విద్యుత్ భద్రత, ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు వంటి అంశాలతో పాటు మండపాల నిర్మాణంలో పనిచేస్తున్న కార్మికుల భద్రతపై కూడా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.పండుగ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ప్రమాదం జరగకముందే అప్రమత్తమై భద్రతా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.మండపాల నిర్మాణంలో పనిచేస్తున్న వలస కార్మికులకు తగిన రక్షణ కల్పించి, వారి ప్రాణాలకు భరోసా కల్పించాలని పలువురు కోరుతున్నారు.

అంగన్వాడి కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలు

అలరించిన చిన్నారుల నృత్యాలు



మహానంది, సెప్టెంబర్ 04, (రిపబ్లిక్ న్యూస్) మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీ అంగన్వాడి కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కృష్ణ భగవానుడి జన్మదిన సందర్భంగా అంగన్వాడి టీచర్ లక్ష్మీనారాయణమ్మ ఆధ్వర్యంలో చిన్నారులను కృష్ణుడు,గోపికల వేషధారణ వేసి సుందరంగా అలంకరించారు.కృష్ణుడు, గోపికలను మధ్యలో నిలబెట్టి చుట్టూ చిన్న పిల్లలు తిరుగుతూ జై కృష్ణ గోపాల కృష్ణ అంటూ ఆటపాటలతో ఆడుతూ సంబరంగా జరుపుకున్నారు. చిన్నారుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు





అనంతపురం కల్చరల్, సెప్టెంబర్ 04,(రిపబ్లిక్ న్యూస్):
త్రైత సిద్ధాంతము ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రబోధా సేవ సమితిహిందూ జ్ఞానవేదిక అనంతపురం శాఖ ఆధ్వర్యంలో నగరంలోని అరవింద్‌నగర్‌లో ద్వారక నిలయం ఎదురుగా ఈ వేడుకలు నిర్వహించారు. త్రిమత ఏకైక గురువు, ఆధ్యాత్మిక సామ్రాజ్య చక్రవర్తి శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారి దివ్య ఆశీస్సులతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా లబ్బే రాఘవ్ మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మదిన వేడుకలను ఏడవ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి జీవరాశికి వర్తించే త్రైత సిద్ధాంతాన్ని శ్రీకృష్ణుడు బోధించారని పేర్కొన్నారు. ఆత్మ, పరమాత్మ శరీరంలో ఎక్కడ ఉన్నారనే అంశాన్ని వివరిస్తూ ప్లకార్డులను ప్రదర్శించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ జీవిత పరమార్థాన్ని తెలుసుకుని ధర్మబద్ధమైన జీవితాన్ని సాగించాలని కోరారు.ఆరు రోజుల పాటు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా చివరి రోజు వచ్చే బుధవారం శ్రీకృష్ణుడి పల్లకి ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని భగవద్గీత జ్ఞానాన్ని తెలుసుకోవాలని ఆయన కోరారు.

వార్తల చేరవేతలో పేపర్ బాయ్‌లదే కీలక పాత్ర

పేపర్ బాయ్ సేవలు అభినందనీయం -కుటాగుల్ల రాజుకు ఘన సన్మానం



అనంతపురం సంక్షేమం, సెప్టెంబర్ 04,(రిపబ్లిక్ న్యూస్):
ప్రతిరోజూ తెల్లవారుజామునే ప్రజలకు వార్తా ప్రపంచాన్ని చేరువ చేస్తున్న పేపర్ బాయ్‌ల సేవలు అభినందనీయమని తెలుగు వెలుగు అధ్యక్షుడు టి.వి.రెడ్డి అన్నారు. పేపర్ బాయ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురంలోని తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆరేళ్లుగా పేపర్ బాయ్‌గా సేవలందిస్తున్న కుటాగుల్ల రాజును మెమెంటో, శాలువా, పుస్తకాలు, ప్రశంసాపత్రంతో ఘనంగా సన్మానించారు. పండుగలు, వర్షాలు, చలి, ఎండలను లెక్కచేయకుండా ప్రజలకు పత్రికలను సమయానికి చేరవేయడంలో పేపర్ బాయ్‌లు చేస్తున్న కృషి గొప్పదని టి.వి.రెడ్డి, ద్విభాషా కవి డాక్టర్ జూటూరు షరీఫ్, మస్తానయ్య పేర్కొన్నారు.సమాజంలో జరిగే మంచి, చెడు, అభివృద్ధి, సమస్యలను ప్రజల ఇంటి ముంగిటకు చేర్చడంలో పేపర్ బాయ్‌ల పాత్ర కీలకమన్నారు. ప్రతి ఉదయం వార్తాపత్రిక ప్రజల చేతికి చేరడంలో వెనుక వారి శ్రమ దాగి ఉంటుందని, వారి సేవలను గుర్తించి గౌరవించడం సమాజ బాధ్యత అని తెలిపారు.
కుటాగుల్ల రాజు పేదరికాన్ని లెక్కచేయకుండా ఆరేళ్లుగా పేపర్ బాయ్‌గా పనిచేస్తూ కుటుంబ బాధ్యతల్లో తండ్రికి అండగా ఉంటూనే మూడో సంవత్సరం బీటెక్ చదువుతున్నాడని తెలిపారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్మికుడిని గౌరవించడమే నిజమైన సామాజిక సేవ అన్నారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం కూడా ఒకప్పుడు పేపర్ బాయ్‌గా పనిచేసి అత్యున్నత స్థాయికి ఎదిగిన విషయాన్ని గుర్తుచేశారు.కార్యక్రమంలో తెలుగు వెలుగు కార్యదర్శులు మస్తానప్ప, జ్యోతి భగత్, బాలకృష్ణ, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ మెట్ల మార్గానికి రూ.30,232 విరాళం

అందజేసిన కుంచపు వడ్డే వెంకటేశులు



శింగనమల (బీకేసి) సంక్షేమం, సెప్టెంబర్ 04,(రిపబ్లిక్ న్యూస్):
శింగనమల నియోజకవర్గం బుక్కరాయసముద్రంలోని శ్రీశ్రీశ్రీ కొండమీద వెంకటరమణ స్వామి దేవస్థానం మెట్ల మార్గం నిర్మాణానికి టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచపు వడ్డే వెంకటేశులు రూ.30,232 విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. తన కార్యాలయంలో ఆలయ ధర్మకర్త ఎస్.నారాయణస్వామి, ఆలయ కమిటీ సభ్యులు, గిరి ప్రదక్షిణ గంగాధర ఆధ్వర్యంలో ఈ విరాళాన్ని అందించారు.
ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్వామివారు ఆలయ పూజారికి కలలో దర్శనమిచ్చి గిరి ప్రదక్షిణ చేయాలని సూచించారన్నారు. భక్తులు అప్పటి నుంచి ప్రతి పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కాలి మార్గం ద్వారా భక్తులకు మరింత సౌకర్యం కల్పించేందుకు 1,116 మెట్ల నిర్మాణానికి సంకల్పించి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.ఏటా వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారని తెలిపారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించాలని కోరారు.
కుంచపు వడ్డే వెంకటేశులు మాట్లాడుతూ, శ్రీ కొండమీద వెంకటరమణ స్వామివారు కలియుగ వైకుంఠనాథుడిగా భక్తుల కొంగుబంగారంగా నిలుస్తున్నారన్నారు. ఆలయ అభివృద్ధిలో భాగస్వామి కావడం సంతోషంగా ఉందన్నారు. 1,116 మెట్ల నిర్మాణ సంకల్పం విజయవంతం కావాలని, భక్తులకు సౌకర్యవంతంగా మెట్ల మార్గం అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. దాతలు కూడా ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి విరాళాలు అందించాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, సి.పి.నారాయణస్వామి, కె.గంగాధర, పోతులయ్య, భద్రంపల్లి ఉజినప్ప,



గోవిందంపల్లి పుల్లారెడ్డి, వడ్డే ప్రసాద్, వడ్డే లచ్చి, కుంచపు లక్ష్మన్న, ఆలగుంట వెంకటరాముడు, రామసాగరం ఆదినారాయణ, రామదాసు, కూడేరు బ్రహ్మయ్య తదితర ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుంటూరు బాలిక కిడ్నాప్ కేసు.. నిందితుడు జాన్ సైదా హర్యానాలో అరెస్ట్

గుంటూరు , సెప్టెంబర్ 04,(రిపబ్లిక్ న్యూస్):
గుంటూరు బాలిక కిడ్నాప్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన షేక్ జాన్ సైదాను పోలీసులు హర్యానాలో అరెస్ట్ చేశారు. మూడు నెలలుగా బాలిక ఆచూకీ లభించకపోవడంపై హైకోర్టు తీవ్రంగా స్పందించిన నేపథ్యంలో, పోలీసులు ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిందితుడిని పట్టుకున్నారు.వివరాల్లోకి వెళితే, గుంటూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలికను షేక్ జాన్ సైదా (రబ్బానీ) ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం పెంచుకుని, మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడు. తన కుమార్తె అపహరణకు గురైందని, ఆమెను తమకు అప్పగించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ బాలిక తండ్రి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌పై జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ తుహిన్ కుమార్ ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. మూడు నెలలు గడిచినా బాలిక ఆచూకీ కనిపెట్టలేకపోవడం పోలీసుల వైఫల్యమేనని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. “ఇలాంటి పోలీసులు ఉండటం ప్రభుత్వానికి సిగ్గుచేటు“ అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌ను పోలీస్ స్టేషన్‌లోకి రాకుండా అడ్డుకోవడంలో చూపిన శ్రద్ధ, బాలికను రక్షించడంలో ఎందుకు చూపలేకపోయారని న్యాయస్థానం పోలీసుల తీరును తప్పుబట్టింది.ఈ కేసు దర్యాప్తులో స్థానిక పోలీసులపై తమకు నమ్మకం లేదని స్పష్టం చేసిన ధర్మాసనం, బాలికను గురువారం కోర్టులో హాజరుపరచాలని నేరుగా ఏపీ డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఇంత తీవ్రంగా స్పందించడంతో, డీజీపీ సిట్ నియామకం జరిపారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ఈ క్రమంలోనే, సాంకేతిక ఆధారాలతో నిందితుడు జాన్ సైదా హర్యానాలో ఉన్నట్లు గుర్తించి, అక్కడికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని, బాలికను గుంటూరుకు తరలించే ప్రక్రియను పోలీసులు ప్రారంభించారు.

నేటి నుంచి ‘స్పెషల్ క్యాంపెయిన్ డే’

కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు

ఓటరు నమోదు, మార్పులు, సవరణలకు అవకాశం ఈఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 4)
కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సెప్టెంబర్ 5, 6 తేదీల్లో నిర్వహించనున్న ‘స్పెషల్ క్యాంపెయిన్ డే’కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి (ఈఆర్వో), నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు.
ఈ మేరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు), సహాయ ఓటరు నమోదు అధికారులు (ఏఈఆర్వోలు), సూపర్‌వైజర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో రెండు రోజులపాటు ప్రత్యేక శిబిరాలను నిర్వహించి, ఓటర్లకు అవసరమైన సేవలు అందించనున్నట్లు తెలిపారు.



కొత్త ఓటర్లకు ఫారం-6
18 ఏళ్లు నిండిన అర్హులైన యువత, ఇప్పటివరకు ఓటరుగా నమోదు కాని అర్హులైన పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఓబులేసు సూచించారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.
అదేవిధంగా ఓటరు జాబితాలో అభ్యంతరాలు వ్యక్తం చేయడం, అనర్హుల పేర్లను తొలగించేందుకు ఫారం-7, పేరు, చిరునామా తదితర వివరాల్లో మార్పులు, సవరణలు లేదా నివాస మార్పు కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు.

ఈ నెల 10 వరకు గడువు
ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని ఈఆర్వో సూచించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు సెప్టెంబర్ 10వ తేదీ వరకు గడువు ఉన్నందున అర్హులైన వారు నిర్దేశిత సమయంలోగా తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు.
స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ఓటర్లకు అవసరమైన సమాచారం, దరఖాస్తుల విషయంలో సహకారం అందిస్తారని తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను పరిశీలించుకుని, అవసరమైన మార్పులు, సవరణలు ఉంటే సంబంధిత ఫారాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చల్లా ఓబులేసు కోరారు.

ఆళ్లగడ్డ ప్రజలకు తాగునీరు విడుదల చేయించాం

ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 4 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ దొర్నిపాడు 16వ బ్లాక్ నుంచి కె సి కెనాల్ ద్వారా విడుదల ఐన తాగు నీటిని పరిశీలించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మాట్లాడుతూ

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా మా కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని నాడు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం. ఆ హామీని నిలబెట్టుకుంటూ, దొర్నిపాడు 16వ బ్లాక్ నుంచి కేసీ కెనాల్ ద్వారా తాగునీటిని విడుదల చేయించాం. స్వయంగా నేనే అక్కడికి వెళ్లి నీటి ప్రవాహాన్ని పరిశీలించాను. ప్రజల అవసరాన్ని గుర్తించి వెంటనే స్పందించిన గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు కు మంత్రులకు, కలెక్టర్ కు ప్రత్యేక ధన్యవాదాలు. ప్రస్తుతం 16వ బ్లాక్ వద్ద 542 క్యూసెక్కులు, 24వ బ్లాక్ వద్ద 200 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఇప్పటికే ఈ ప్రవాహం 27వ బ్లాక్ వరకు చేరింది.

ఈ నీరు పంటల సాగు కోసం కాదు, కేవలం తాగునీటి అవసరాల కోసమేనని ప్రజలు, రైతులు గుర్తించాలి. ఒక్క చుక్క నీరు కూడా వృథా కాకుండా గ్రామాల్లోని చెరువులు, కుంటలను ముందుగా నింపాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. మనుషులు, పశువుల దాహం తీర్చడమే మన తొలి ప్రాధాన్యం. రాబోయే రోజుల్లో వర్షాలు కురిసి నీటి మట్టం పెరిగితే, తప్పకుండా వ్యవసాయానికి కూడా నీరందేలా తగిన చర్యలు తీసుకుంటాం.వైసీపీ నాయకులు చేసే తప్పుడు రాజకీయ ప్రచారాలను ఎవరూ నమ్మవద్దు. నాడు ప్రభుత్వంలో సాగునీటి సలహాదారుగా ఉండి రైతుల సమస్యలను గాలికొదిలేసిన గంగుల ప్రభాకర్ రెడ్డి నేడు మాట్లాడటం విడ్డూరం. మేము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రైతుల పక్షాన నిలిచేది భూమా కుటుంబమే. పదవుల కంటే ప్రజల సంక్షేమమే మాకు ముఖ్యం. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వాడుకుని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరుతున్నామని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ కోరారు.

సమస్యల పరిష్కారానికి ఎప్పుడు అందుబాటులో వుంటా

ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 4 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి తక్షణ పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్నినిర్వహించారుఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కి నేరుగా విన్నవించారు. ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను ఎమ్మెల్యే స్వయంగా విని, సమస్యకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం సంబంధిత శాఖల అధికారులకు ఎమ్మెల్యే ఫోన్ చేసి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి కూడా ప్రాధాన్యత ఇస్తూ ముందుకుసాగుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రజల సమస్యలను వినడం మాత్రమే కాదుడ వాటికి పరిష్కారం చూపించడమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కొనసాగుతుందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.

వేదవతి ఎత్తిపోతల పథకానికి జీ.ఓ జారీపై ఎంపీ బస్తిపాటి నాగరాజు హర్షం

రూ.1,942.80 కోట్లతో పరిపాలనా అనుమతులు.. -80 వేల ఎకరాలకు సాగునీరు, 196 గ్రామాలకు తాగునీరు




కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 4)

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన వేదవతి ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ జీ.ఓ.ఆర్.టి. నంబర్ 497 జారీ చేయడంపై ఎంపీ బస్తిపాటి నాగరాజు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లాలో కరువును శాశ్వతంగా నివారించడంతో పాటు వలసలను అరికట్టాలనే లక్ష్యంతో 2019లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రూ. 1,799.80 కోట్ల అంచనా వ్యయంతో వేదవతి ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతులు ఇచ్చిందని ఎంపీ తెలిపారు. అయితే గత ప్రభుత్వం హయాంలో ఈ ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వేదవతి ప్రాజెక్టును ప్రాధాన్యతా క్రమంలో చేర్చి ముందుకు తీసుకెళ్లారని పేర్కొన్నారు. ప్రస్తుతం రూ. 1,942.80 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీ.ఓ. జారీ చేయడం అభినందనీయమన్నారు. వేదవతి ఎత్తిపోతల పథకం పూర్తయితే ఆలూరు, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో సుమారు 80 వేల ఎకరాలకు సాగునీరు, అలాగే 196 గ్రామాలకు తాగునీరు అందుబాటులోకి వస్తుందని ఎంపీ నాగరాజు తెలిపారు. తద్వారా పశ్చిమ కర్నూలు ప్రాంతంలో కరువు తీవ్రత తగ్గి, రైతులకు సాగునీటి భరోసా కలగడంతో పాటు వలసలు కూడా తగ్గే అవకాశం ఉందన్నారు.ఆస్పరి సంజీవని గ్రామసభలో ఇచ్చిన హామీకి కట్టుబడి వేదవతి ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసి పరిపాలనా అనుమతులు జారీ చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి జిల్లా ప్రజల తరఫున ఎంపీ బస్తిపాటి నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

భూమా అభిమాని గుండె పోటుతో మృతి

నివాళులు అర్పించిన భూమా జగత్ విఖ్యాతరెడ్డి



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 4 రిపబ్లిక్ న్యూస్ ఆళ్లగడ్డ తాలూకా సిరివెళ్ళ మండలం గోవింద పల్లె గ్రామానికి చెందిన భూమా కుటుంబ అభిమాని పండ్ల కొండయ్య గుండెపోటుతో మృతి చెందారు అన్న విషయం తెలుసుకున్న, ఆళ్లగడ్డ టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి అక్కడికి వెళ్లి పూలమాలవేసి నివాళు లర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ భూమా కుటుంబం టిడిపి ప్రభుత్వం ఎల్లవేళలా మీకు అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా ఇవ్వడం జరిగింది.

భాష్యం ప్రిన్సిపల్ కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

అవార్డును అందజేసిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



అనంతపురం కల్చరల్, సెప్టెంబర్ 04.(రిపబ్లిక్ న్యూస్):

భాష్యం విద్యాసంస్థల అనంతపురం ప్రిన్సిపల్ ఎం. బాలకృష్ణ ప్రతిష్టాత్మకమైన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ముఖ్య అతిథులు గా అంబికా లక్ష్మీనారాయణ, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డా. పద్మశ్రీ, ఎస్ఎస్బీఎన్ కళాశాల ప్రిన్సిపల్ పతికి రమేష్ నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం భాష్యం స్కూల్ లో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో ఆయనకు ఈ పురస్కారాన్ని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అందజేశారు.విద్యారంగంలో ఆయన అందిస్తున్న సేవలు, విద్యార్థుల అభివృద్ధికి చేస్తున్న కృషి, పాఠశాల నిర్వహణలో చూపుతున్న అంకితభావాన్ని గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసి అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థుల అభివృద్ధికి పనిచేయడానికి ప్రేరణనిస్తుంది

ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ తనను అవార్డుకు ఎంపిక చేసి ప్రోత్సహించిన ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు సుంకర రమేష్, బిసాతి భరత్, మారుతి, జీవన్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తన విజయానికి సహకరిస్తున్న భాష్యం విద్యాసంస్థల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ అవార్డు మరింత బాధ్యతతో విద్యార్థుల అభివృద్ధికి పనిచేయడానికి ప్రేరణనిస్తుందని ఆయన పేర్కొన్నారు. బాలకృష్ణను ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.



నగరడోన గ్రామంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు






చిప్పగిరి, సెప్టెంబర్, 4,(రిపబ్లిక్ న్యూస్) చిప్పగిరి మండలం నగరడోన గ్రామంలో శుక్రవారం ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఘన ఘనంగా జరిగాయి, ఈ సందర్భంగా శ్రీకృష్ణుడు అలంకరించి కృష్ణుడి విగ్రహానికి పూజ మందిరాన్ని పువ్వులతో అలంకరించి, కృష్ణుని విగ్రహాన్ని పూజా మందిరాన్ని పువ్వులతో అలంకరించారు ,అక్షింతలు ధూప దీపాలతో స్వామి వారిని పూజించారు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ శ్రీకృష్ణష్టిమి మంచి లక్షణాలని అలవర్చుకోవాలని మంచి విషయంలోనూ స్వార్థం ఈర్ష అసూయాలను వీడనాడాలని మన జన్మకు సార్థకతని ఏర్పరచుకోవాలని శ్రీకృష్ణుడు తన లీలల ద్వారా భక్తులకు జ్ఞానోపదేశం చేశాడని తెలిపారు, శ్రీకృష్ణుని యువకులు ఉట్టి కొట్టి కేరింతలతో ఉత్సాహంగా జరిపారు, అనంతరం వైభవంగా శ్రీకృష్ణుని ఊరేగింపు జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనం

గుత్తిలో ప్రత్యేక పూజలు.. కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ





గుత్తి, సెప్టెంబర్ 4 (రిపబ్లిక్ న్యూస్)

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గుత్తి పట్టణంలోని శ్రీకృష్ణ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధిలో భాగంగా నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ చేశారు. కార్యక్రమానికి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ హాజరయ్యారు. యాదవ్ సోదరులు, సోదరీమణులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ శ్రీకృష్ణుడి బోధనలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. ధర్మం, సత్యం, న్యాయం, కర్తవ్యంతో ముందుకు సాగాలని సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రేమ, ఆప్యాయతతో మెలగాలని, శాంతి, సోదరభావాన్ని పెంపొందించాలని కోరారు. శ్రీకృష్ణుడి జీవితం, భగవద్గీత సందేశం నేటి తరానికి కూడా మార్గదర్శకమని అన్నారు. ఆలయ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని ఎంపీ తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో భక్తులకు, స్థానిక ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమి పవిత్రమైన పర్వదినమన్నారు. శ్రీకృష్ణుడి బోధనలు ధర్మం, సత్యం వైపు నడిపిస్తాయని తెలిపారు. కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని న్యాయం కోసం నిలబడాలని సూచించారు. ప్రజలంతా ఐకమత్యంతో ఉండి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని వెంకట శివుడు యాదవ్ తెలిపారు. చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించడం ద్వారా పండుగ విశిష్టతను తెలియజేయాలన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని సూచించారు.

కార్మికులు, శ్రామికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆయన తెలిపారు. కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అందుతున్న పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్మిక కుటుంబాల సంక్షేమం కోసం మరిన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆలయ అభివృద్ధిలో భాగంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేయడం సంతోషంగా ఉందని వెంకట శివుడు యాదవ్ అన్నారు. నిర్మాణం పూర్తయితే భక్తులకు, స్థానికులకు వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

కార్యక్రమంలో పవన్ నరసింహులు కిట్టా యాదవ్ సుంకన్న శ్రీనివాస్ యాదవ్ సుధాకర్ నాయుడు ఆలయ కమిటీ వారు భక్తాదులు పాల్గొన్నారు

కర్నూలులో ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు





కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 4 (రిపబ్లిక్ న్యూస్)

కర్నూలులో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి.శ్రీకృష్ణ ఆలయ కమిటీ, శ్రీకృష్ణ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని నంద్యాల చెక్ పోస్ట్ వద్దనున్న శ్రీకృష్ణ రుక్మిణి మాత ఆలయంలో శ్రీకృష్ణ, శ్రీ రుక్మిణి మాతాకు ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జామునే స్వామికి పంచామృత అభిషేకాలు, అర్చనలు విశేషమైన పూజలు చేశారు. అంతకుముందు సి. క్యాంపు కూడలి నుంచి శ్రీకృష్ణ శ్రీ రుక్మిణి మాత ఆలయం వరకు స్వామివారి పల్లకి ఉత్సవం కనుల పండువగా సాగింది. చిన్నారులు ధరించిన శ్రీకృష్ణ గోపికల వేషధారణలు, తాళ మేళాలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉట్టి ఉత్సవ కార్యక్రమంలో యువత చిన్న పెద్ద తేడా లేకుండా అంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నవితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆర్ఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ బాల మద్దయ్య యాదవ్, టిడిపి సీనియర్ నాయకులు వై. నాగేశ్వరరావు యాదవ్, వైసీపీ సీనియర్ నాయకులు నర్సింలు యాదవ్, రాంపుల్లయ్య యాదవ్, విశ్రాంత ప్రిన్సిపల్ వి నాగేశ్వరరావు యాదవ్, ఆదర్శ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ హరికిషన్ యాదవ్, టిడిపి నాయకులు ప్రభాకర్ యాదవ్, బిజెపి యువ మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

గుత్తి కోటలో విద్యార్థుల సందడి

పర్యాటక ప్రదేశంగా మరింత ప్రాచుర్యం

గుత్తి కోట, సెప్టెంబర్ 4(రిపబ్లిక్ న్యూస్)



పామిడి మోడల్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం గుత్తి కోటను సందర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ ఆధ్వర్యంలో ఎక్సకర్షన్‌లో భాగంగా విద్యార్థులు కోటకు వచ్చారు. కోట ముఖద్వారం వద్ద వారికి గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు స్వాగతం పలికారు.

సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ విద్యార్థులకు గుత్తి కోట చరిత్ర, నిర్మాణ విశిష్టత, కోటలోని చారిత్రక కట్టడాలు, ప్రకృతి అందాలు, పర్యాటక ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులు ఉత్సాహంగా కోటపైకి ట్రెక్కింగ్ చేస్తూ చారిత్రక కట్టడాలను సందర్శించారు.

చారిత్రక ప్రదేశాలను విద్యార్థులు ప్రత్యక్షంగా సందర్శించడం ద్వారా చరిత్రపై అవగాహన పెరగడంతో పాటు ప్రకృతి, పర్యాటక రంగంపై ఆసక్తి పెరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. గుత్తి కోటను పర్యాటక ప్రదేశంగా మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కార్యక్రమంలో సమితి గౌరవ సభ్యుడు బాబాసాహెబ్, సభ్యుడు వీరేష్, పామిడి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతల పై రంగయ్య గళం

హనుమిరెడ్డిపల్లి సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనకు సంఘీభావం



కళ్యాణదుర్గం సంక్షేమం, సెప్టెంబర్ 04,(రిపబ్లిక్ న్యూస్)

అనధికార విద్యుత్ కోతలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు మాజీ ఎంపీ, వైసీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య సంఘీభావం తెలిపారు. హనుమిరెడ్డిపల్లి సబ్‌స్టేషన్ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న రైతుల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంటలను కాపాడుకునేందుకు 9 గంటల నిరంతరాయ ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.రైతుల ఆందోళనపై స్పందించిన రంగయ్య జిల్లా కలెక్టర్, విద్యుత్‌శాఖ ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు తెలిపారు.ఎమ్మెల్యేను నిలదీసిన రైతులు ఆందోళన స్థలానికి చేరుకున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు రైతులతో మాట్లాడి నిరసన విరమించాలని కోరారు. అయితే విద్యుత్ కోతలు, సరఫరాలో అంతరాయాలపై రైతులు ప్రశ్నించడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రంగయ్య సూచించారు.రైతుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు వారి తరఫున పోరాడుతామని రంగయ్య పేర్కొన్నారు.

బీజేపీ సీనియర్ నేత జన్మదిన వేడుకలు



గుత్తి, సెప్టెంబర్ 4: (రిపబ్లిక్ న్యూస్)

భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, జాతీయ కౌన్సిల్ సభ్యుడు జంగం రెడ్డి అంకాలరెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం తాడిపత్రి పట్టణంలోని ఆయన నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో రజాక్‌వలి, భాష, హాజీ భాష, కరీం బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు గుర్తించేందుకు 'పల్లె నిద్ర' కార్యక్రమం....



రేణిగుంట సెప్టెంబర్ :4(రిపబ్లిక్ న్యూస్)రేణిగుంట మండలంలోని అన్నాస్వామి పల్లి గ్రామంలో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు రేణిగుంట సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో "పల్లె నిద్ర" కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఐ జయచంద్ర స్థానిక ప్రజలు, యువకులు, పెద్దలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో వేధిస్తున్న మౌలిక వసతుల కొరత, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, వీధిదీపాలు, రవాణా సౌకర్యాల గురించి గ్రామస్థులతో సమగ్రంగా చర్చించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని కాపాడుకోవాలని, ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రస్తుతం తీవ్రరూపం దాల్చుతున్న సైబర్ నేరాలు, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే ప్రమాదాలు, నష్టాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సీఐ రాత్రి వేళ స్వయంగా గ్రామస్తులతో కలిసి పల్లెలోనే బస చేసి ప్రజల్లో ధైర్యాన్ని, నమ్మకాన్ని నింపారు.ఉన్నతాధికారులు స్వయంగా తమ గ్రామానికి వచ్చి రాత్రి వేళ నిద్రించి సమస్యలను గుర్తించడం పట్ల అన్నాస్వామి పల్లి మరియు రామకృష్ణ పురం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు సీఐ జయచంద్రకు ఆవుల రమేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి, శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పోలీసుల ఈ వినూత్న చొరవ స్థానిక ప్రజల ప్రశంసలు అందుకుంటోంది.

గోవింద నామస్మరణతో మారుమోగిన చౌడేపల్లి

చౌడేపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 04 రిపబ్లిక్ న్యూస్





చౌడేపల్లి మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని భక్తులు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలవ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, ఆలయాలన్నీ కృష్ణుడి నామస్మరణతో మారుమోగాయి.

చౌడేపల్లి పట్టణంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో వేడుకలు కోలాహలంగా సాగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు వశిష్టాచార్యులు ఆధ్వర్యంలో ఉభయదారులు శ్రీరామ్ జగదీష్ రాయల్ చే ఉదయాన్నే స్వామివార్లకు శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించి, కన్నులపండువగా విశేష అలంకరణ చేశారు. ఉదయం నుంచే స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. సాయంత్రం వరకు ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. పట్టణంతో పాటు అగ్రహారంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు కన్నులపండువగా నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు దర్శన ఏర్పాట్లు చేయడంతో పాటు పవిత్ర తీర్థప్రసాదాలను అందజేశారు. మండలప్రజలు ఉత్సాహంగా పాల్గొనడంతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆధ్యాత్మిక శోభతో దిగ్విజయంగా పూర్తయ్యాయి.

రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

రేణిగుంట సెప్టెంబర్ :4 (రిపబ్లిక్ న్యూస్)





మండలంలోని ముసగలపాలెం గ్రామంలో రైతులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ రైతుల సమక్షంలో ఆయన స్వయంగా లబ్ధిదారులకు పాసుపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, ప్రతీ రైతుకు న్యాయం జరిగేలా పారదర్శకంగా పాలన అందిస్తున్నామని స్పష్టం చేశారు.ఈ పంపిణీ మహోత్సవంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడుతో పాటు ప్రముఖ నాయకులు ధనుంజయ నాయుడు, మోహన్ నాయుడు, శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అలాగే బిసి సెల్ ప్రధాన కార్యదర్శి బొడుగు మునిరాజా యాదవ్, యూనిట్ ఇంచార్జీలు కేసీనేని సుబ్రమణ్యం, కృష్ణప్ప మొదలియార్, తెలుగు యువత అధ్యక్షుడు హేమాక్షి రాయల్ మరియు రాయపనేని రవి నాయుడు ప్రత్యేక హాజరై రైతులకు శుభాకాంక్షలు తెలిపారు.

ముసగలపాలెంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజల నుంచి, స్థానిక రైతుల నుంచి విశేష స్పందన లభించింది. టిడిపి నాయకులు, శ్రేణులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి గ్రామంలో సందడి వాతావరణాన్ని నెలకొల్పారు. తమకు పట్టాదారు పాసుపుస్తకాలు అందడం పట్ల గ్రామ రైతులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తూ, శ్రమించి పనిచేస్తున్న ప్రజాప్రతినిధులకు, నాయకులకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

కాపెర్ల సుబ్బారాయుడు నాయుడు ఆధ్వర్యంలో 3కోట్ల వ్యయం అంచనాతో

శ్రీకృష్ణ దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన.

రైల్వే కోడూరు సెప్టెంబర్ 4 రిపబ్లిక్ న్యూస్.







బడి నిర్మించాలన్న ఉద్దేశంతో ఓబులవారిపల్లి మండలం చిన్నఓరంపాడు పరిధిలోని గ్యాస్ కార్యాలయం ఎదురుగా 78 సెంట్ల భూమిని ఖరీదు చేయడం జరిగినదని, బడి నిర్మాణానికి ఎన్నో ప్రయత్నాలు చేశానని అవన్నీ వృధా అయ్యాయని, కానీ దైవ సంకల్పం గుడి నిర్మించాలని ఉందని,అందుకే గుడి ప్రయత్నం ప్రారంభించగానే అన్ని సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో గుడి నిర్మాణానికి గ్రామంలోని పెద్దల సహకారంతో శుక్రవారం గుడి నిర్మాణానికి కాపెర్ల సుబ్బారాయుడు నాయుడు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేయడం జరిగినది అని స్థలదాత గుడి నిర్మాణ కర్త కాపేర్ల సుబ్బరాయుడు నాయుడు అన్నారు, ఈ శంకుస్థాపన రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ కడప ఆర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి తెలుగుదేశం పార్టీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి శంకుస్థాపన చేయడం జరిగినది,

శ్రీకృష్ణ దేవాలయ నిర్మాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగినది,సుమారు 78 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి, ఆ ప్రదేశంలో శ్రీకృష్ణ మందిరాన్ని నిర్మించాలనే సంకల్పంతో ముందడుగు వేశారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య శంకుస్థాపన పూజలు నిర్వహించగా, పరిసర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కాపేర్లసుబ్బరాయుడు నాయుడు మాట్లాడుతూ సుమారు రూ.3 కోట్ల అంచనా వ్యయంతో శ్రీకృష్ణ దేవాలయాన్ని నిర్మించాలనే సత్ సంకల్పంతో ఈ ప్రాంత ప్రజలకు భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఆలయ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లుఅయన తెలిపారు. ఈ దేవాలయ నిర్మాణ క్రమంలో దాతలు ప్రజలు భక్తులు ఎవరైనా ఈ సత్సంకల్పానికి చేయూతగా విరాళాలు ఇచ్చి ఈ నిర్మాణ సంకల్పంలో భాగస్వాములు కావాలని అందరిని ప్రార్థిస్తున్నానని ఆయన అన్నారు,

దేవాలయ నిర్మాణానికి రాజకీయ నాయకులు, వివిధ గ్రామాల ప్రజలు, భక్తులు తమ వంతు సహాయ సహకారాలు, విరాళాలు అందించాలని ఆయన కోరారు. అందరి ఆశీస్సులు, సహకారంతో ఆలయ నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేసి శ్రీకృష్ణ మందిరాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలన్నదే తన లక్ష్యమని ఆయన తెలిపారు, గతంలో ఈ గ్రామంలో సీతారాముల గుడి నిర్మాణానికి 40 లక్షల రూపాయల విరాళంగా ఇవ్వడం జరిగినదని సుబ్బరాయుడు సందర్భంగా అన్నారు ఎన్నో రోజులుగా బడి నిర్మించాలన్న సంకల్పాన్ని నెరవేరకపోగా గుడి నిర్మించాలన్న సత్సంకల్పం వెనువెంటనే కార్యరూపం దాల్చడం ఇది దైవ సంకల్పంగా భావించి ముందడుగు వేయడం జరిగినదని,నేడు దైవ సంకల్పానికి శంకుస్థాపనతో శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందన్నారు. భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని అన్ని హంగులతో త్వరితగతిన పూర్తి చేస్తామని పేర్కొన్నారు.ఈ శంకుస్థాపన కార్యక్రమానికి పరిసర గ్రామాల ప్రజలు, రాజకీయ నాయకులు, భక్తులు వందలాది సంఖ్యలో శ్రీకృష్ణ మందిర నిర్మాణ శంకుస్థాపనలో పాల్గొనడం జరిగినది పార్టీలకు అతీతంగా ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ముక్కా వరలక్ష్మి, ఓబులవారిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ సుజన్ కుమార్,నాగేంద్ర నాయుడు, కావుటూరు గజేంద్రనాయుడు, నాగినేని రమేష్, కోటి, చంద్రశేఖర్, ప్రసాద్, చిన్మయ అరణ్య ఆశ్రమ శారదా మాత, పలువురు సర్పంచులు ఎంపీటీసీలు భక్తులు గ్రామస్తులు కార్యక్రమం జయప్రదం చేయడం జరిగినది, దీంతో కార్యక్రమ ప్రాంగణం భక్తులతో సందడిగా మారిందన్నారు

మస్జిద్-ఏ-సఫీ నిర్మాణం విజయవంతం కావాలి

రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు షకీల్ షఫీ

అనంతపురం ప్రతినిధి, సెప్టెంబర్ 04,(రిపబ్లిక్ న్యూస్):



మస్జిద్-ఏ-సఫీ నిర్మాణం విజయవంతం కావాలని రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు అల్‌హాజ్ కె.ఎం. షకీల్ షఫీఅన్నారు. ఈ సందర్భంగా అనంతపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ బల్లా పల్లవి, శ్రీ సురేష్ దంపతులు అల్‌హాజ్ కె.ఎం. షకీల్ షఫీ దంపతులను శుక్రవారం వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో ఆత్మీయంగా సమావేశమై పలు విషయాలపై చర్చించారు.నూతనంగా నిర్మించనున్న మస్జిద్-ఏ-సఫీ నిర్మాణ కార్యక్రమం గురించి ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు. మస్జిద్ నిర్మాణం ఒక పవిత్రమైన, సామాజిక ప్రాధాన్యత కలిగిన కార్యక్రమమని పేర్కొంటూ.. నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా కొనసాగాలని వారు ఆకాంక్షించారు. నిర్ణయించిన లక్ష్యాలకు అనుగుణంగా నిర్మాణ కార్యక్రమాలు త్వరితగతిన పూర్తై, భక్తులు, ప్రజలకు అందుబాటులోకి రావాలని శుభాకాంక్షలు తెలిపారు.మతపరమైన కార్యక్రమాలతో పాటు సమాజ సేవకు కూడా ప్రాధాన్యం కల్పించేలా మస్జిద్-ఏ-సఫీ అభివృద్ధి చెందాలని వారు కోరుకున్నారు. ఈ పవిత్ర కార్యక్రమానికి ప్రతి ఒక్కరి సహకారం, భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. మస్జిద్ నిర్మాణం విజయవంతంగా పూర్తయి ప్రజలకు ఆధ్యాత్మిక ప్రశాంతతతో పాటు సామాజిక సేవలకు వేదికగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా అల్‌హాజ్ కె.ఎం. షకీల్ షఫీ దంపతులతో బల్లా పల్లవి, శ్రీ సురేష్ ఆత్మీయంగా మాట్లాడి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం విజయవంతం కావాలని, నిర్మాణ పనులు ఎలాంటి విఘ్నాలు లేకుండా పూర్తికావాలని ఆకాంక్షించారు.

ట్రంప్ దృష్టిలో అగ్రస్థానంలో మోదీ

అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు!

న్యూఢిల్లీ,, సెప్టెంబరు 4 (రిపబ్లిక్ న్యూస్)



జీ20 సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా వెళ్లనున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీని కలవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతగానో కోరుకుంటున్నారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. డిసెంబర్‌లో ఫ్లోరిడాలో జరిగే జీ20 సదస్సు కేవలం బహుపాక్షిక సమావేశాలకే పరిమితం కాకపోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ దృష్టిలో మోదీ స్నేహితుడని, 35 మంది నేతలు వస్తే ఎవరిని కలవాలనుకుంటారని అడిగితే.. మోదీ ఆయన జాబితాలో అగ్రస్థానంలో ఉంటారని గోర్ చెప్పారు. 2020లో భారత పర్యటనను ట్రంప్ ఇప్పటికీ ఎంతో ఇష్టంగా గుర్తుచేసుకుంటున్నారని, వచ్చే ఏడాది ఆయన భారత్‌కు వచ్చే అవకాశం కూడా ఉందని సంకేతాలు ఇచ్చారు. అమెరికా–భారత్ సంబంధాలు ఇతర దేశాలు అసూయపడే రీతిలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై కూడా గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు తర్వాత చర్చలను మళ్లీ కొనసాగిస్తున్నామని, ఒప్పందం “చాలా దగ్గర్లోనే ఉంది” అని తెలిపారు. రాబోయే కొన్ని నెలల్లో ఒప్పందం ఖరారవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 240 బిలియన్ డాలర్లు ఉండగా.. దీన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని మోదీ, ట్రంప్ లక్ష్యంగా పెట్టుకున్నారు. భారత్ ఆర్థికంగా బలపడటం అమెరికాకు కూడా ప్రయోజనకరమని గోర్ అన్నారు. మోదీ దేశానికి స్థిరత్వాన్ని అందిస్తున్నారని ప్రశంసించారు. అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెంచుతున్నాయని, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు డేటా సెంటర్లు, ఏఐ కేంద్రాలు, ఔషధ రంగాల్లో విస్తరిస్తున్నాయని చెప్పారు. అమెరికాలోకి కొత్తగా 24 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడంలోనూ రాయబార కార్యాలయం సహకరించిందన్నారు. భారత్ తమకు విశ్వసనీయమైన రక్షణ భాగస్వామి అని గోర్ పేర్కొన్నారు. రక్షణ సంబంధాలు కేవలం ఆయుధాల కొనుగోళ్లకే పరిమితం కావని, పరస్పర విశ్వాసం కూడా కీలకమని చెప్పారు. జావెలిన్ క్షిపణి ప్రాజెక్టు, అపాచీ హెలికాప్టర్ల సరఫరా, మరిన్ని రక్షణ పరికరాలపై చర్చలను ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. అమెరికాతో భారత్ ఇతర దేశాల కంటే ఎక్కువగా సైనిక విన్యాసాలు నిర్వహిస్తోందన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అక్టోబర్‌లో మరోసారి భారత్‌కు రానున్నారు. తక్కువ వ్యవధిలో విదేశాంగ మంత్రి రెండుసార్లు భారత్‌కు రావడం అరుదని గోర్ అన్నారు. మరికొందరు అమెరికా కేబినెట్ మంత్రులు, మూడు రాష్ట్రాల గవర్నర్లు కూడా ఈ ఏడాది భారత్‌లో పర్యటించే అవకాశం ఉందన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా వచ్చే నాలుగు నెలల్లో మూడుసార్లు అమెరికా వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాతో కూడిన క్వాడ్ కూడా ఇరు దేశాల భాగస్వామ్యంలో కీలకమని గోర్ అన్నారు. మానవతా సాయం, విపత్తుల నిర్వహణ, సైనిక సహకారం, కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, కీలక ఖనిజాల రంగాల్లో నాలుగు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. త్వరలో నాలుగు దేశాల నేతల శిఖరాగ్ర సమావేశం నిర్వహించేందుకు అమెరికా ఆసక్తిగా ఉందన్నారు.

గురువే జ్ఞానజ్యోతి.. సమాజ నిర్మాణానికి మార్గదర్శి

నేడు ఉపాధ్యాయ దినోత్సవం -డా. సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళి

న్యూఢిల్లీ,, సెప్టెంబరు 4 (రిపబ్లిక్ న్యూస్)



విద్యార్థి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత అత్యంత కీలకమైన పాత్ర పోషించేది గురువు. అక్షర జ్ఞానాన్ని అందించడమే కాకుండా, క్రమశిక్షణ, విలువలు, బాధ్యత, మానవత్వం వంటి గొప్ప లక్షణాలను విద్యార్థుల్లో పెంపొందిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేసే ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి. అందుకే ప్రతి ఏడాది సెప్టెంబర్ 5న దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు.

స్వతంత్ర భారతదేశ తొలి ఉపరాష్ట్రపతి, రెండో రాష్ట్రపతిగా సేవలందించిన ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 5ను ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఉపాధ్యాయ వృత్తిపై ఆయనకున్న అపారమైన గౌరవం, విద్య పట్ల ఆయనకున్న నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకం.

పాఠ్యపుస్తకాలకు మించి జీవిత పాఠాలు

ప్రస్తుత కాలంలో విద్యా రంగం వేగంగా మారుతోంది. సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధస్సు, డిజిటల్ తరగతులు అందుబాటులోకి వచ్చినప్పటికీ గురువు స్థానం మాత్రం ఎప్పటికీ ప్రత్యేకమే. విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, వైఫల్యాలను అధిగమించే ధైర్యాన్ని ఇవ్వడం, మంచి పౌరుడిగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుడి బాధ్యత.ఒక మంచి ఉపాధ్యాయుడు బోధించే పాఠం తరగతి గది గోడలను దాటి విద్యార్థి జీవితాంతం వెంట ఉంటుంది. అందుకే సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పులుగా ఉపాధ్యాయులను అభివర్ణిస్తారు.

విద్యార్థుల విజయమే గురువుకు నిజమైన గౌరవం

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. విద్యార్థులు తమ గురువులను సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేస్తారు. ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను సన్మానించి వారి సేవలను గుర్తించడం ద్వారా సమాజం వారికి కృతజ్ఞతలు తెలియజేస్తుంది.గురువు అందించిన జ్ఞానం, చూపిన మార్గం, ఇచ్చిన ప్రోత్సాహం విద్యార్థి జీవితాన్ని మార్చగలవు. విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగడమే ఉపాధ్యాయుడికి లభించే అత్యున్నత పురస్కారం.

గురువులకు వందనం

ఉపాధ్యాయ దినోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదు.. గురువు గొప్పతనాన్ని గుర్తుచేసుకునే రోజు. మన జీవితంలో విజయం సాధించేందుకు దారి చూపిన ప్రతి గురువుకు కృతజ్ఞతలు తెలిపే సందర్భం. జ్ఞానాన్ని పంచుతూ భావితరాలను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు.

“గురువు ఒక దీపం.. తాను వెలుగుతూ ఎన్నో జీవితాలకు వెలుగునిచ్చే మహోన్నత వ్యక్తి.”

ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు కేఆర్ఎంబీ కీలక సూచనలు

ఉమ్మడి జలాశయాల్లో తగ్గిన నీటి నిల్వలు

విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని విడుదల చేయవద్దని స్పష్టీకరణ

తాగునీటి అవసరాలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం

పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలను నియంత్రించాలని సూచన


న్యూఢిల్లీ,, సెప్టెంబరు 4 (రిపబ్లిక్ న్యూస్)



ఉమ్మడి జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) తెలుగు రాష్ట్రాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. కేవలం విద్యుత్ ఉత్పత్తి అవసరాల కోసం జలాశయాల నుంచి దిగువకు నీటిని విడుదల చేయవద్దని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను బోర్డు స్పష్టంగా ఆదేశించింది. ప్రస్తుతం కృష్ణా బేసిన్‌లోని ఉమ్మడి ప్రాజెక్టులలో నీటి లభ్యత ఆశాజనకంగా లేదని, అందువల్ల అందుబాటులో ఉన్న జలాలను అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని బోర్డు నొక్కి చెప్పింది. ఇరు రాష్ట్రాల తాగునీటి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించడంతో పాటు, ముఖ్యంగా పోతిరెడ్డిపాడు నుండి నీటి విడుదలను నియంత్రించాలని స్పష్టం చేసింది.

నీటి ఎద్దడి నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకే ప్రాధాన్యం ఇవ్వాలని విభజన చట్టంలో స్పష్టంగా ఉందని బోర్డు గుర్తు చేసింది. ఉభయ రాష్ట్రాలు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని, నీటి వినియోగంలో సంయమనం పాటించాలని కోరింది. నీటి కొరత తీవ్రంగా ఉన్నందున, వృథాను అరికట్టి ఇరు రాష్ట్రాలు సమన్వయంతో వ్యవహరించాలని హితవు పలికింది.

జీవనకాల గరిష్ఠానికి స్మాల్ క్యాప్స్



న్యూఢిల్లీ,, సెప్టెంబరు 4 (రిపబ్లిక్ న్యూస్)అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపుపై ఆందోళనలు తగ్గడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాల్లో ముగిశాయి. అయితే కీలక స్థాయిల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం, మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు మార్కెట్ జోరును కొంత అడ్డుకున్నాయి. విస్తృత మార్కెట్‌లో కొనుగోళ్ల మద్దతుతో స్మాల్‌క్యాప్ సూచీలు కొత్త జీవనకాల గరిష్ఠాలను తాకాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 362.57 పాయింట్లు (0.48 శాతం) లాభపడి 76,515.43 వద్ద ముగిసింది. ఓ దశలో 730 పాయింట్ల వరకు ఎగబాకి 76,883.14ను తాకింది. నిఫ్టీ 24.25 పాయింట్లు (0.10 శాతం) పెరిగి 23,897.70 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,005.75 వరకు వెళ్లింది. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మెటల్ సూచీ 1 శాతానికి పైగా పెరిగి అగ్రస్థానంలో నిలిచింది. బ్యాంకింగ్ మినహా ఆర్థిక సేవల షేర్లలోనూ కొనుగోళ్లు కనిపించాయి. మరోవైపు నిఫ్టీ ఐటీ 0.47 శాతం, ఫార్మా 0.68 శాతం, హెల్త్‌కేర్ 0.87 శాతం చొప్పున నష్టపోయాయి. మార్కెట్‌లో ఒడుదొడుకులను సూచించే ఇండియా వీఐఎక్స్ 6.24 శాతం తగ్గి 10.63కి చేరింది. ఆగస్టులో కోర్ ద్రవ్యోల్బణం స్వల్పంగా తగ్గే అవకాశాలు ఫెడ్ వడ్డీ రేట్ల విషయంలో విరామం ఉంటుందనే అంచనాలను బలపరచొచ్చని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు బలమైన కంపెనీల ఆర్థిక ఫలితాలు, స్థిరమైన ఆర్థిక వృద్ధి, దేశీయ డిమాండ్ మార్కెట్‌పై మదుపర్ల నమ్మకాన్ని కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. రూపాయి 0.09 శాతం బలపడి డాలర్‌కు రూ.94.48 వద్ద ట్రేడైంది. ఎఫ్ఐఎన్ఆర్ డిపాజిట్లలోకి కొత్తగా నిధులు రావడం డాలర్ లిక్విడిటీకి మద్దతిచ్చింది.

నేపాల్ బాధితులకు అండంగా నిలిచిన సోనూసూద్



న్యూఢిల్లీ,, సెప్టెంబరు 4 (రిపబ్లిక్ న్యూస్)ఇటీవల సంభవించిన తీవ్ర వరదలతో అల్లాడుతున్న నేపాల్ ప్రజలను ఆదుకునేందుకు ప్రముఖ నటుడు, రియల్ హీరో సోనూసూద్ రంగంలోకి దిగిన సంగతి తెలిసిందే. బాధితులకు అవసరమైన దుప్పట్లు, ఆహార పదార్థాలు, ఇతర నిత్యావసర సరుకులను భారత్ నుంచి తరలించి, క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అయితే, సోనూసూద్ నేపాల్ పర్యటనపై ప్రముఖ జర్నలిస్ట్ అజిత్ అంజుమ్ సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించారు. పనులు ఇంకా ప్రారంభం కాకముందే ఆయనను దేవుడిగా చిత్రీకరిస్తూ ప్రచారం చేసుకోవడం కేవలం ‘సెల్ఫ్ మార్కెటింగ్’ అని ఎక్స్‌లో పోస్ట్ పెట్టడం కలకలం రేపింది. అయితే ఈ ప్రతికూల విమర్శలపై సోనూసూద్ ఎంతో హుందాగా, సానుకూలంగా స్పందించారు. “సోదరా.. మీ మనసు చాలా మంచిది. మీరు నేపాల్‌కు రండి, మనమిద్దరం కలిసి ప్రజలకు అండగా నిలబడి సాయం చేద్దాం” అంటూ రీట్వీట్ చేశారు. ఎలాంటి వివాదాలకు చోటు ఇవ్వకుండా, తనను విమర్శించిన వ్యక్తినే నేరుగా సేవా కార్యక్రమంలో భాగస్వామి కావాలని ఆహ్వానించిన ఆయన తీరు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. సోనూసూద్ చూపించిన ఈ సంస్కారం, పరిణతిపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. కాగా, త్రిశూలి నది పరివాహక ప్రాంతాల్లో వరద విధ్వంసం తీవ్రంగా ఉందని, బాధితుల ఇళ్లను పునర్నిర్మించి వారు సాధారణ జీవితం గడిపే వరకు కొన్ని నెలల పాటు తమ ‘సూద్ ఫౌండేషన్’ తరఫున సహాయక చర్యలు కొనసాగుతాయని సోనూసూద్ స్పష్టం చేశారు. పరాయి దేశంలోనూ మానవత్వాన్ని చాటుకుంటూ ఆయన అందిస్తున్న సేవలకు గానూ అంతటా అభినందనలు వ్యక్తమవుతున్నాయి.

.....

రికార్డు సృష్టించిన ఇటలీ ప్రధాని..



న్యూఢిల్లీ,, సెప్టెంబరు 4 (రిపబ్లిక్ న్యూస్)ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆ దేశ రాజకీయ చరిత్రలో ఒక అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. యుద్ధానంతర ఇటలీ చరిత్రలో అత్యధిక కాలం నిరంతరాయంగా ప్రధానిగా పనిచేసిన వ్యక్తిగా ఆమె నిలిచారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. మెలోనీని ‘నా స్నేహితురాలు’ అని సంబోధిస్తూ, ఆమె నాయకత్వంపై ఇటలీ ప్రజలకు ఉన్న విశ్వాసానికి ఈ మైలురాయే నిదర్శనమని ప్రశంసించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్’ వేదికగా మోదీ స్పందిస్తూ.. “ఇటలీ యుద్ధానంతర చరిత్రలో సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగుతున్న నా స్నేహితురాలు జార్జియా మెలోనీకి అభినందనలు. ఈ విజయం ఆమె నాయకత్వంపై ఇటలీ ప్రజలు ఉంచిన నమ్మకానికి, విశ్వాసానికి ప్రతీక” అని పేర్కొన్నారు. భారత్–ఇటలీ మధ్య ‘ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం’ బలోపేతం కావడంలో మెలోనీ స్నేహం కీలక పాత్ర పోషించిందని మోదీ అన్నారు. భవిష్యత్తులో కూడా ఇరు దేశాల ప్రజల శ్రేయస్సు కోసం కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. 2022 అక్టోబర్ 22న ఇటలీ తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన జార్జియా మెలోనీ, ఇవాళ్టికి 1,413 రోజులు పదవిలో పూర్తి చేసుకున్నారు. తద్వారా మాజీ ప్రధాని సిల్వియో బెర్లుస్కోనీ రికార్డును ఆమె అధిగమించారు. గత జులైలో ప్రధాని మోదీ భారత చరిత్రలో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా నిలిచినప్పుడు మెలోనీ కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇరు దేశాల ప్రజలకు కొత్త అవకాశాలు సృష్టించేందుకు కలిసి పనిచేస్తామని ఆమె పేర్కొన్నారు. గత మే నెలలో మోదీ ఇటలీలో పర్యటించినప్పుడు ఇరు దేశాల సంబంధాలను ‘ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం’ స్థాయికి పెంచుతూ ఇరు నేతలు నిర్ణయం తీసుకున్నారు. ఈ పర్యటన సందర్భంగా మోదీ, మెలోనీకి సరదాగా ‘మెలోడీ’ చాక్లెట్ల ప్యాకెట్‌ను బహుమతిగా ఇచ్చారు. సోషల్ మీడియాలో వారిద్దరి పేర్లతో వైరల్ అయిన ‘చవీవశ్రీశీఅ’ ట్రెండ్‌ను ఇది గుర్తుచేసింది. ఈ ఆసక్తికర క్షణాలను మెలోనీ ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటూ మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇరు నేతల మధ్య ఉన్న ఈ స్నేహపూర్వక వాతావరణం ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

.....

చింతలూరు లో వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



రాయికల్ మండలం సెప్టెంబర్,04(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం చింతలూరు గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు.ఆలయంలో ప్రత్యేక పూజలు పురోహితులు చెరుకు మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.అనంతరం బాలబాలికలు శ్రీకృష్ణ, గోపిక ల వేషధారణలో ఉట్లు కొట్టె వేడుకలు ఘనంగా జరిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోత్ వనిత రమేష్ నాయక్, ఆలయ కమిటీ చైర్మన్ మక్కుల సాయికుమార్ ఉప సర్పంచ్ నర్సయ్య మాజీ సర్పంచ్ వోరుగంటి మోహన్ రావు, గ్రామ నాయకులు, వోరుగంటి భూమా రావు, వెంకటేశ్వరరావు, అజయ్ రాజు సుధాకర్ రవీందర్ వార్డు సభ్యులు నర్సయ్య , గంగాధర్ సత్యం నర్సయ్య సురేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

రెడ్డిల నిరసన దీక్ష పోస్టర్ ఆవిష్కరణ ధర్నా ఈ నెల 8 న విజయవంతవానికై పిలుపు..

-రాయికల్ మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు చింతల పల్లి గంగారెడ్డి



రాయికల్ మండలం సెప్టెంబర్,04(రిపబ్లిక్ న్యూస్) రెడ్డి జేఏసీ రెడ్డి ఐక్యవేదిక రెడ్డి జాగృతి రెడ్డి సంఘం తెలంగాణ రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 8 మంగళవారం రోజున హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్నటువంటి నిరసన దీక్ష కార్యక్రమానికి మండలంలోని రెడ్డి సోదరి సోదరిమణులందరూ తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాయికల్ మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు చింతలపల్లి గంగారెడ్డి పిలుపునిచ్చినారు. శుక్రవారం రోజున దీక్ష పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించినారు రెడ్డి ల డిమాండ్లు అయినటువంటి 1000 కోట్లతో రెడ్డి కార్పొరేషన్ పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని, రైతు బీమా ను ప్రభుత్వం కొనసాగించాలని గత ప్రభుత్వం రెడ్డి హాస్టల్ కొరకు బుద్వేల్ లో కేటాయించిన 15 ఎకరాల భూమిని ఈ ప్రభుత్వం క్యాన్సల్ చేసినా అట్టి భూమిని అక్కడనే రెడ్డి బంధువులకు ఇవ్వాలి ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లను ప్రభుత్వం అన్ని విభాగాలలో అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నేటి రాజేందర్‌రెడ్డి ఏలేటి రాజేందర్‌రెడ్డి, గడ్డం దీపక్ రెడ్డి, కుంబాల శ్రీనివాస్ రెడ్డి, నాగిరెడ్డి తిరుపతిరెడ్డి, అంబాల శివకుమార్, గడ్డం గంగారెడ్డి, యుద్ధం సుధీర్ రెడ్డి, కొల్ల కృష్ణారెడ్డి, కురుమ మల్లారెడ్డి, పాతూరి జలపతి రెడ్డి,జిల్లాల చిన్న మల్లారెడ్డి,నాగిరెడ్డి, రవీందర్ రెడ్డి, పాతూరి రమాపతి రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి, దమ్మ గంగారెడ్డి,కొయ్యడు మని, కుంభాల సంతోష రెడ్డి, బేటి సత్యం రెడ్డి, బుచ్చిరెడ్డి, గడ్డం జంగారెడ్డి, మంతెన రవీందర్ రెడ్డి దొంగ హరికృష్ణ రెడ్డి లు పాల్గొన్నారు

సనతన ధర్మాన్ని నేర్పే సరస్వతీ శిశు మందిరం రాయికల్ నూతన భవనం నిర్మించడానికి ₹1,50,111,విద్యా సేవకు చేయూత

బిజెపి రాష్ట్ర ఓబిసి మోర్చా ఉపాధ్యక్షులు మచ్చ నారాయణ

రాయికల్ మండలం సెప్టెంబర్,04(రిపబ్లిక్ న్యూస్)



సరస్వతీ శిశు మందిరం అభివృద్ధికి మచ్చ విజయ నారాయణ బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు)₹1,50,111/- (ఒక లక్ష యాభై వేల నూట పదకొండు రూపాయలువిరాళంగా భవన నిర్మాణ కమిటీ అధ్యక్షులు బోడగం మోహన్ రెడ్డి కి అందజేశారు.ఈ సందర్భంగా మచ్చ విజయ,నారాయణ కి హృదయపూర్వక కృతజ్ఞతలుఈ కార్యక్రమంలోగాజంగి అశోక్ , బొమ్మకంటి గోపాల్ , కుర్మ మల్లారెడ్డి (రాయికల్ బీజేపీ పట్టణ అధ్యక్షులు), గంప ఆనంద్ , కుర్మ పెద్ద మల్లారెడ్డి , డా తురగ రాజారెడ్డి , మచ్చ శ్రీధర్ , మామిడాల లక్ష్మీనారాయణ , కూనరపు భూమేష్((ప్రధాన కార్యదర్శి) , కడకుంట్ల ప్రభాకర్ , లింగ శ్రీనివాస్ , బూర్ల గంగన్న , తోపారపు సురేష్ , బోడగం శ్రీకాంత్ రెడ్డి , కడార్ల శ్రీనివాస్ , జోగ గంగరాజం సామల్ల సతీష్ గారు, వాసం నర్సయ్య , దాసరి సంతోష్ పాల్గొన్నారు.

ట్రాన్స్ఫార్మరా...కరుణించు..!

సామాజిక కార్యకర్త వెంకట రెడ్డి వినూత్న నిరసన

మల్లాపూర్ సెప్టెంబర్ 4 (రిపబ్లిక్ న్యూస్)



మల్లాపూర్ మండల కేంద్రంలో అప్రకటిత విద్యుత్ కోతలతో సతమతమవుతున్నామని ప్రముఖ సామాజిక కార్యకర్త ఏనుగు వెంకటరెడ్డి వినూత్నంగా నిరసన చేపట్టారు. స్థానికంగా అందుబాటులో ఉండవలసిన విద్యుత్ అధికారులు మరియు సిబ్బంది పట్టణ ప్రాంతాల్లో ఉండడంతో సమస్యలు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. రాత్రి, పగలు సమయాల్లో కరెంటు ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో దేవుడికే తెలుసని ఒక విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కు వినతి పత్రం ఇచ్చారు. ఇకనైనా ప్రభుత్వం మరియు ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చూడాలని కోరారు .

అర్హులైన భూములను 22-ఏ నిషేధిత జాబితా నుంచి వెంటనే తొలగించాలి

ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో జనసేన భారీ నిరసన..- తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ డిమాండ్





రాయికల్ మండలం సెప్టెంబర్,04(రిపబ్లిక్ న్యూస్)

హైదరాబాద్ తెలంగాణలో 22-ఏ నిషేధిత జాబితాలో కొనసాగుతున్న అర్హులైన భూముల సమస్యకు ప్రభుత్వం తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని జనసేన తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ డిమాండ్ చేశారు.

ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన దీక్షలో ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి 22-ఏ సమస్యతో భూ యజమానులు తమ భూములను విక్రయించుకోలేక, రిజిస్ట్రేషన్లు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అర్హత ఉన్న భూములను సైతం నిషేధిత జాబితాలో కొనసాగించడం వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

"ప్రజల భూములను ప్రజలకే దక్కేలా చేయాలి. 22-ఏ పేరుతో అర్హులైన భూ యజమానులను సంవత్సరాల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పడం సరికాదు. ప్రభుత్వం వెంటనే సమీక్షించి అర్హులైన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి" అని శంకర్ గౌడ్ స్పష్టం చేశారు.

ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి

22-ఏ భూములకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించాలని జనసేన డిమాండ్ చేసింది. అర్హులైన భూ యజమానుల సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి వారికి న్యాయం చేయాలని కోరింది.

22-ఏ కారణంగా భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడం వల్ల ప్రజల ఆర్థిక అవసరాలు, కుటుంబ భవిష్యత్ ప్రణాళికలు దెబ్బతింటున్నాయని జనసేన నాయకులు పేర్కొన్నారు. బాధిత భూ యజమానుల కోసం ప్రత్యేక పరిష్కార వ్యవస్థ ఏర్పాటు చేసి, ప్రతి దరఖాస్తును పారదర్శకంగా పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

"హక్కుల కోసం పోరాటం.. పరిష్కారం వచ్చే వరకు ఉద్యమం"

"22-ఏ సమస్యను కేవలం ఫైళ్లలో పెట్టి కాలయాపన చేయకుండా ప్రభుత్వం ప్రజల క్షేత్రస్థాయి సమస్యను గుర్తించాలి. భూమి ప్రతి కుటుంబానికి కేవలం ఆస్తి మాత్రమే కాదు.. వారి భవిష్యత్‌కు ఆధారం. ప్రజల భూహక్కులను పరిరక్షించే వరకు జనసేన పోరాటం కొనసాగుతుంది" అని శంకర్ గౌడ్ స్పష్టం చేశారు.

ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో జరిగిన ఈ నిరసనకు తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై 22-ఏ సమస్యపై ప్రభుత్వాన్ని తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

22-ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు ప్రజల పక్షాన జనసేన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్కే సాగర్, రాష్ట్ర నాయకులు మచ్చ సుధాకర్, శ్రీధర్ శర్మ, నల్లా సురేష్ రెడ్డి, దుంపటి శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర వీర మహిళ మండపాక కావ్య శిరీష చల్లా శివారెడ్డి , జగిత్యాల జిల్లా సీనియర్ నాయకుడు బెక్కం జనార్దన్, పటాన్‌చెరువు ముఖ్య నాయకుడు ఎడమ రాజేష్ తదితరులు

రాయికల్ లో రైతు ర్యాలీలో "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మారాలి కెసిఆర్ మళ్ళీ అధికారంలోకి రావాలి" బీఆర్ఎస్ నేతల పిలుపు

-రైతు సమస్యలపై భారీ ర్యాలీ, రైతు సదస్సు రాష్ట్ర నాయకులు హాజరు







రాయికల్ మండలం సెప్టెంబరు,04(రిపబ్లిక్ న్యూస్)

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.

రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో గురువారం రైతు ర్యాలీ, రైతు సదస్సు నిర్వహించారు.

మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

గాంధీ విగ్రహం నుంచి మార్కెట్ వరకు పార్టీ జెండాలు, ప్లకార్డులతో భారీ ర్యాలీ నిర్వహిస్తూ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి రాష్ట్ర బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణను సాధించిన కేసీఆర్ హయాంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని పేర్కొన్నారు.

ప్రస్తుత ప్రభుత్వం అరకొర విద్యుత్ సరఫరాతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. కాళేశ్వరం, ఎస్సారెస్పీ ద్వారా సాగునీటి విషయంలో గత ప్రభుత్వ హయాంలో రైతులకు మేలు జరిగిందన్నారు. కన్నెపల్లి పంప్ నుంచి నీటిని ఎత్తిపోసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరుతో రైతుల నుంచి కోతలు విధిస్తున్నారని ఆరోపించారు.

ట్రక్ షీట్, ధర్మకాంటా తూకాల మధ్య వ్యత్యాసాలను పరిశీలించి, రైతులకు రావాల్సిన మొత్తాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇందుకు విజిలెన్స్ విచారణ చేపట్టాలని కోరారు.

కేసీఆర్ హయాంలో రైతులకు రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు అమలు చేసి అండగా నిలిచామని అన్నారు. రైతు రుణమాఫీ విషయంలోనూ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు.

యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఎరువుల పంపిణీలో ఆంక్షలు తొలగించాలని డిమాండ్ చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నదని విమర్శించారు.

దావ వసంత సురేష్ మాట్లాడుతూ.. దేశానికి అన్నం పెట్టే రైతు బాగుంటేనే ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంటుందన్నారు. కేసీఆర్ హయాంలో రైతుబీమా, రైతుబంధు ద్వారా రైతు కుటుంబాలకు భరోసా కల్పించామని తెలిపారు.

(ప్రస్తుత ప్రభుత్వం రైతుభరోసా, రైతుబంధు విషయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు.రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీరు, ఎరువులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

రాబోయే రోజుల్లో ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై మరింత బలంగా పోరాటం చేస్తామని తెలిపారు.

రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలి.. ట్రక్ షీట్, ధర్మకాంటా తూకాల వ్యత్యాసాలను సరిచేసి రైతులకు న్యాయం చేయాలి..

మల్లాపూర్ చక్కెర ఫ్యాక్టరీని పునరుద్ధరించాలి.. రైతు సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు ప్రకటించారు.

ఈ కార్యక్రమ సదస్సుకు బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల జిల్లా పరిషత్ తొలి చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్, శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సౌజన్య శ్రీదర్ రెడ్డి , పట్టణ ,మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట శ్రీ వేణుగోపాల స్వామి మందిరంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు





ప్రజా రిపబ్లిక్ / అందోల్ జోగిపేట/సెప్టెంబర్ 4

అందోల్ నియోజకవర్గం జోగిపేట మున్సిపల్ పట్టణంలోని 11వ వార్డులో గల శ్రీ వేణుగోపాలస్వామి మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు గుర్రం కృష్ణ దంపతుల చేత పూజ కార్యక్రమం తొట్టెల కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమం ప్రతిసంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా జరిగిందని ఆలయ కమిటీ క్రాంతి యూత్ సభ్యులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కాలనీవాసులు చిన్నలు పెద్దలు క్రాంతి సభ్యులు అందరూ పాల్గొని ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేశారు



నూతన వధూవరులను ఆశీర్వదించిన మల్లాపూర్ మండల ప్రెస్ క్లబ్ మిత్రులు

మల్లాపూర్ సెప్టెంబరు 4 (రిపబ్లిక్ న్యూస్)

మల్లాపూర్ మండలం పాత ధామ్ రాజ్ పల్లి గ్రామానికి చెందిన రొండ్ల రాజేశ్వరి రాజారెడ్డి కూతురు వివాహానికి మల్లాపూర్ మండల ప్రెస్ క్లబ్ మిత్రులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అంగరంగ వైభవంగా జరిగిన ఈ వివాహ వేడుకలకు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రుద్ర రాంప్రసాద్, కృష్ణమాచారి, కనుక సంజీవ్, పెంబి మహేష్, బక్కూరి రాజశేఖర్, ఆదారి రాజేందర్, బండారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

ప్రజల నుంచి మా ప్రభుత్వానికి వంద మార్కులు

చంద్రబాబు నాయకత్వంపై ప్రజల్లో పూర్తి సంతృప్తి..

అభివృద్ధి, సంక్షేమ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం: మంత్రి టీజీ భరత్



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 4)

కూటమి ప్రభుత్వ పాలన, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. కర్నూలు నగరంలోని 10వ వార్డులో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకంఅభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలను సేకరించామని, ప్రజలు తమ ప్రభుత్వానికి వంద మార్కులు ఇచ్చారని మంత్రి పేర్కొన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన కొత్త లబ్ధిదారులకు త్వరలో పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. కర్నూలు నగరంలో డ్రైనేజీ, విద్యుత్, రహదారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

హైకోర్టు బెంచ్‌పై ఆందోళన అవసరం లేదు

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు విషయంలో న్యాయవాదులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని తాను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని వ్యక్తిగతంగా కలిసి కోరినట్లు తెలిపారు. కర్నూలుకు హైకోర్టు బెంచ్ తప్పకుండా వస్తుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు.
మంత్రి నారా లోకేష్ సైతం ఈ అంశంపై స్పష్టత ఇచ్చారని తెలిపారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు న్యాయపరమైన ప్రక్రియకు అనుగుణంగా జరగాల్సి ఉన్నందున న్యాయవాదులు ఓపికగా ఉండాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

చిన్న మట్టి విగ్రహాలతో వినాయక చవితి జరుపుకోవాలి

కర్నూలు జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు



లేకపోవడంతో నీటి లభ్యత తక్కువగా ఉందని మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఈ నేపథ్యంలో వినాయక చవితి వేడుకల్లో ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. పెద్ద విగ్రహాలకు బదులుగా చిన్న పరిమాణంలో మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.చిన్న మట్టి విగ్రహాలను నిమజ్జనం చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని, అవసరమైతే ఇంటి వద్దే నిమజ్జనం చేసుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం తాగునీటికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో పరిస్థితిని అర్థం చేసుకుని ప్రజలు సహకరించాలని మంత్రి టీజీ భరత్ విజ్ఞప్తి చేశారు.

ఓటర్ల జాబితా సవరణ పేరుతో సైబర్ మోసాలు

నకిలీ లింకులు, ఏపీకే ఫైల్స్‌తో మోసాలకు పాల్పడే అవకాశం.. అప్రమత్తంగా ఉండాలన్న కర్నూలు ఎస్పీ



కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 4)

ఓటర్ల జాబితా సవరణ, ఓటరు కార్డులో పేర్లు, వివరాల మార్పుల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడే అవకాశం ఉందని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ హెచ్చరించారు.ఎన్నికల సంఘం ప్రతినిధులుగా పరిచయం చేసుకొని, ఓటరు వివరాలు తప్పుగా ఉన్నాయని, దరఖాస్తు తిరస్కరణకు గురైందని చెప్పి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. అనంతరం వాట్సాప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా నకిలీ లింకులు, అనుమానాస్పద ఏపీకే ఫైల్స్ పంపించి, తక్కువ మొత్తంలో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని కోరుతూ బ్యాంకు ఖాతా, కార్డు వివరాలు, ఓటీపీ వంటి రహస్య సమాచారాన్ని సేకరించి నగదు కాజేసే అవకాశం ఉందన్నారు.ఈ నేపథ్యంలో ప్రజలు తెలియని లింకులు, ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేయడం, డౌన్‌లోడ్ చేయడం చేయవద్దని ఎస్పీ సూచించారు. చిన్న మొత్తంలో ఫీజు చెల్లించాలంటూ వచ్చే సందేశాలను నమ్మకూడదని, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, సీవీవీ, పాస్‌వర్డ్, ఓటీపీ వంటి రహస్య సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని తెలిపారు.ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించి అధికారిక ఎన్నికల సంఘం సేవలను మాత్రమే వినియోగించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ, పేరు తిరస్కరణ, వివరాల మార్పులు లేదా చేర్పులపై సందేహాలు ఉంటే సంబంధిత గ్రామ పంచాయతీ లేదా పట్టణ పరిధిలోని బూత్ లెవల్ ఆఫీసర్‌ను (బీఎల్ఓ) నేరుగా కలిసి వివరాలను ధృవీకరించుకోవాలని తెలిపారు.అనుమానాస్పద ఫోన్ కాల్స్ లేదా సందేశాలు వస్తే స్పందించకుండా సంబంధిత అధికారుల ద్వారా నిజ నిర్ధారణ చేసుకోవాలని ఎస్పీ కోరారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించడంతో పాటు సైబర్‌క్రైమ్.గవ్.ఇన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

పరమటూరు మధు సూధన్ రెడ్డికి డాక్టరేట్

హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు, గ్రామస్తులు





బండి ఆత్మకూరు, సెప్టెంబర్ 04,(రిపబ్లిక్ న్యూస్):- బండి ఆత్మకూరు మండలం,పరమటూరు గ్రామానికి డి.శివరామిరెడ్డి, సువర్ణమ్మ దంపతుల కుమారుడు రైతు బిడ్డ డి.మధు సూధన్ రెడ్డి డాక్టరేట్ పొందారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఆయన ఎస్వీ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పీహెచ్ డి పూర్తి చేశారు. గత నెలలో తిరుపతి శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ నిర్వహించిన "యూన్ ఎఫిషియంట్ ఏఐ– బేస్డ్ క్రాప్ రికమండేషన్ సిస్టమ్ యూజింగ్ డీప్ లర్నింగ్ అండ్ ఎన్సెంబుల్ మెషిన్ లెర్నింగ్ మోడల్స్" అంశం పై మధు సూధన్‌రెడ్డి సమర్పించిన పరిశోధన సిద్ధాంత గ్రంధాన్ని పరిశీలించడానికి నియమించబడిన పరీక్షకుల బోర్డు నివేదికను విశ్వవిద్యాలయం ఆమోదించినట్లు తెలిపారు. ఈ మేరకు డాక్టర్.మధుసూదన్ రెడ్డికి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పిహెచ్డి ప్రధానం చేయనున్నట్లు ఎస్వీ యూనివర్సిటీ నుంచి ఉత్తర్వులు అందినట్లు బంధువులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌డీకి అర్హత సాధించి త్వరలో యూనివర్సిటీ అధిపతి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకోనున్నారు. దీంతో మధు సూధన్ రెడ్డి కుటుంబ సభ్యులు,స్నేహితులు, గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఆయనకు స్నేహితులు, బంధువులతో పాటు పలువురు విద్యావంతులు, మేధావులు అభినందనలు తెలియజేస్తున్నారు. మారుమూల గ్రామంలో జన్మించిన ఆయన ఉన్నత విద్యాభ్యాసాలు పూర్తి చేసి, తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో పీహెచ్‌డీకి ఎంపికవ్వడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మధుసూదన్ రెడ్డి తన బంధుమిత్రులకు శ్రేయోభిలాషులకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రిపబ్లిక్ కథనానికి స్పందన

జగనన్న కాలనీలో నీటి సరఫరాకు అధికారుల చర్యలు

పాడైపోయిన విద్యుత్ మోటారుకు మరమ్మత్తులు -సంతోషం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు



బండి ఆత్మకూరు, సెప్టెంబర్ 4, (రిపబ్లిక్ న్యూస్):-

మండల కేంద్రం బండి ఆత్మకూరులోని జగనన్న కాలనీలో నీటి ఎద్దడిపై ప్రజా రిపబ్లిక్ దినపత్రికలో రెండు రోజుల క్రితం గుక్కెడు నీళ్లు ఇప్పించండి.. సారూ ? అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. నీటి సమస్య పరిష్కారానికి పంచాయతీ అధికారులు రంగంలోకి దిగి కాలనీలో చర్యలు చేపట్టారు. పాడైపోయిన విద్యుత్తు మోటారును శుక్రవారం ప్రత్యేక యంత్రం ద్వారా బోరులో నుంచి బయటకు తీసి మరమ్మత్తులు చేయిస్తున్నారు. విద్యుత్ మోటారుకు మరమ్మత్తులు పూర్తి అయిన వెంటనే నీటి సమస్యకు పరిష్కారం చూపిస్తామని పంచాయతీ అధికారులు తెలిపారు. అయితే పది రోజులకు పైగా కొళాయిలకు నీరు రాకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అంశంపై పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని కాలనీవాసులు తెలిపారు. ఈ క్రమంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను ప్రజా రిపబ్లిక్ దినపత్రికలో ప్రచురించడం జరిగింది. దీంతో స్పందించిన అధికారులు వెంటనే సహాయక చర్యలు ముమ్మరం చేయడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పాడైపోయిన మోటార్ వెలికితీస్తున్న దృశ్యం

గ్రీవెన్స్ డేలో అర్జీలు స్వీకరించిన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి



కల్లూరు ప్రతినిధి, సెప్టెంబర్ 4 (రిపబ్లిక్ న్యూస్)

కర్నూలు జిల్లా కల్లూరు మండలం మాధవి నగర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించిన పాణ్యశీ నియోజకవర్గం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని, మిగిలిన సమస్యలను నిర్దీత కాలవ్యవధిలో పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు, ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని సూచించారు

పోలీసుల సత్వర స్పందనకు శభాష్..

ఆన్‌లైన్‌లో మోటార్‌సైకిల్ కొనుగోలు వ్యవహారంలో బాధితుడికి న్యాయం



నంద్యాల క్రైం, సెప్టెంబర్ 3, (రిపబ్లిక్ న్యూస్): ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసి జిల్లా, చికియ చందోలి గ్రామానికి చెందిన సత్యం పాండే (24) ఆన్‌లైన్‌లో టీవీఎస్ రైడర్ మోటార్‌సైకిల్‌ను కొనుగోలు చేసేందుకు నంద్యాల జిల్లా సంజామల మండలం ఆల్వకొండ గ్రామానికి చెందిన గిరి హుస్సేన్తో ఫోన్ ద్వారా సంప్రదించాడు. మోటార్‌సైకిల్ ధరను రూ.40,000/-గా నిర్ణయించుకుని, సత్యం పాండే ఇప్పటికే రూ.30,000/-ను PhonePe ద్వారా చెల్లించాడు. మిగిలిన రూ.10,000/- చెల్లిస్తే వాహనాన్ని ట్రాన్స్‌పోర్ట్ ద్వారా పంపాలని కోరగా, హుస్సేన్ మరో రూ.20,000/- చెల్లించాలని చెప్పడంతో సత్యం పాండే నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ఫోన్ ద్వారా సంప్రదించాడు. వెంటనే స్పందించిన పోలీసులు ఈ విషయాన్ని సంజామల ఎస్ఐ రమణయ్య, కోయిలకుంట్ల సీఐ హనుమంతు నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. వారు హుస్సేన్‌ను పిలిపించి ఇరువర్గాల సమస్యను పరిష్కరించారు. ముందుగా అంగీకరించిన ప్రకారం సత్యం పాండే మిగిలిన రూ.10,000/- చెల్లించగా, హుస్సేన్ మోటార్‌సైకిల్‌ను అతనికి అప్పగించాడు. సత్యం పాండేకు తెలుగు తెలియకపోవడం, హుస్సేన్‌కు హిందీ అర్థం కాకపోవడం వల్ల ఏర్పడిన భాషా సమస్యను కూడా పోలీసులు పరిష్కరించి ఇరువురికి న్యాయం చేశారు. పోలీసులు సత్వరమే స్పందించి తన సమస్యను పరిష్కరించినందుకు సత్యం పాండే నంద్యాల జిల్లా పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేసి, పోలీసుల స్పందనపై సంతోషం వ్యక్తం చేశాడు.

ఇంటింటికీ తెలుగుదేశం : 45 రోజుల లక్ష్యం ముందే పూర్తి.. కోటి కుటుంబాలను పలకరించిన టీడీపీ

సెప్టెంబర్ 4 (రిపబ్లిక్ న్యూస్)

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, తెలుగుదేశం పార్టీ (టీడీపీ) చేపట్టిన బృహత్తర ప్రచార కార్యక్రమం 'ఇంటింటికీ తెలుగుదేశం 2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం' రికార్డు స్థాయిలో విజయవంతంగా కొనసాగుతోంది. 45 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటినీ పలకరించాలనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ కార్యక్రమం, నిర్దేశిత గడువు కంటే ముందే కోటికి పైగా కుటుంబాలను సందర్శించి చారిత్రక మైలురాయిని అందుకుంది. ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తూనే, వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ యాత్ర సాగింది. ఈ చారిత్రక విజయంపై టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణుల కృషిని అభినందిస్తూ ఆయన ప్రత్యేకంగా స్పందించారు. "ఇంటింటికీ తెలుగుదేశం-2026 కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా కోటికి పైగా ఇళ్లకు తీసుకెళ్లిన కార్యకర్తలు, నేతలకు హృదయపూర్వక అభినందనలు. ఇంటింటి పర్యటనల్లో ప్రజలను కలిసి, ప్రభుత్వ పథకాలను వివరించిన తీరు అద్భుతం. కేవలం సందర్శించడమే కాకుండా, ఆయా కుటుంబాల సమస్యలు, స్థానిక అవసరాలు, ప్రభుత్వ పథకాలపై వారి అభిప్రాయాలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన తెలుగుదేశం కుటుంబానికి ధన్యవాదాలు" అని లోకేశ్ పేర్కొన్నారు.

శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న పాణ్యం మాజీ ఎమ్మెల్యేకాటసాని రామభూపాల్ రెడ్డి

కల్లూరు ప్రతినిధి, సెప్టెంబర్ 4 (రిపబ్లిక్ న్యూస్)



శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని కల్లూరు అర్బన్ పరిధిలోని పెద్దపాడు రోడ్డు ఇందిరమ్మ కాలనీలో నిర్వహించిన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీకృష్ణుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.అనంతరం కర్నూలు వెంకటరమణ కాలనీలోని తనీష్ కన్వెన్షన్ హాల్ నందు నిర్వహించిన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు మరియు శ్రీల ప్రభుపాదుల వారి 130వ వ్యాస పూజ మహోత్సవ కార్యక్రమంలో కాటసాని రామభూపాల్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక మాజీ కో-ఆప్షన్ మెంబర్ కృష్ణమూర్తి రంగారెడ్డి వార్డు నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com